ప్రజాశక్తి ప్రకాశం

బుధవారం జనవరి - 3 2018

16 పేజీలు



సభా వేదికపై అధికారులు, ప్రజాప్రతినిధులతో 'జన్మభూమి- మా వూరు' ప్రతిజ్ఞ చేయిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు



సిఎం చంద్రబాబు నాయుడుకు జ్ఞాపికను అందిస్తున్న మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు

వెలుగొండను పూర్తి చేసే బాధ్యత నాదే

- దొనకొండ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు చర్యలు
- ఖరారైన ట్రిపుల్ ఐటి భూములు
- గనుల విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తా
- జన్మభూమి - మాఊరు ప్రారంభ సభలో సిఎం వెల్లడి

16లో ▲

హామీలు తప్ప అభివృద్ధి శూన్యం

ప్రభుత్వ తీరుపై సిపిఎం మహాసభల్లో చర్చించాలని సదస్సులో పలువురు వక్తల సూచన

3లో ▲

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత


సిఎం సహాయనిధి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్
పేద ప్రజలకు మెరుగైన కార్పొరేట్ వైద్యసేవలు అందించడానికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చంద్రబాబు ఆపన్నహస్తం అందిస్తు న్నారని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. మంగళవారం ఇసుక దర్శిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాయంలో జరిగిన కార్యక్రమంలో పర్చూరు నియోజక వర్గంలోని చినగంజాం, ఇంకొల్లు, కారంచేడు, పర్చూరు, యద్దనపూడి, మార్టూరు మండలాలకు చెందిన 32మంది లబ్దిదారులకు రూ, 18,74,714 చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె హరిబాబు, టిఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వెద్యశిబిరం

ప్రజాశక్తి-పర్చూరు
కృత్రిమ అవయవాల పరికరాలు అమర్చేందుకు బెంగుళూరులో ఉచిత వైద్య శిభిరాన్ని రోటరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు రోటరీ అధక్ష, కార్యదర్శులు పి చంద్రశేఖరరావు, పాబోలు వెంకటేశ్వర్లు తెలిపారు. 3వ తేదీ నుండి 9వ తేదీ వరకు ఉచిత వైద్య శిభిరం కొనసాగుతుందని అవసరమైన వారు పాల్గొనవచ్చని చెప్పారు. వికాలంగుల ప్రయాణ ఖర్చులను పర్చూరు రోటరీక్లబ్ సమకూరుస్తుందని, వసతిని బెంగుళూరు రోటరీక్లబ్ వారు ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. శిభిరానికి వెళ్లదలచిన వారు వివరాలు అందిస్తే అందుకు ఏర్పాట్లు చేస్తామని అధ్యక్షులు చంద్రశేఖర్ తెలిపారు. శ్రీభగవాన్ మహవీర్ వికలాంగ సాహిత్య సమితి జైపూరి వారి సౌజన్యంతో శివాజీనగర్, బెంగుళూరులో నిర్వహిస్తున్నారని వివరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి

ప్రజాశక్తి-పర్చూరు
అర్హులందరికి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ ఫలాలు అందాలన్నదే సి ఎం ముఖ్య లక్ష్యమని జడ్పిటిసి సభ్యురాలు దాసరి ఉషారాణి చెప్పారు. జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో భాగంగా మండలంలోని చెరుకూరు గ్రామాల్లో మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. ప్రతి కుటుంబం నెలకు రూ.10వేలు ఆదాయం పొందేలా కార్యచరణ రూపొందించి అమలుచేస్తున్నట్లు ఉషారాణి తెలిపారు. చెరుకూరు 23మందికి, కొత్తపాలెంలో 8మందికి రేషన్‌కార్డులు పంపిణీచ ఏశారు.

పెద్దవారిపాలెంలో ...
ప్రజల సమస్యలు తెలుసుకుని పారదర్శకంగా పరిష్కరించేందుకే జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ బిట్రా శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పెద్దివారిపాలెంలో జన్మభూమి కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ కొల్లా శివపార్వతి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఐదుగురికి పింఛన్లు, నలుగురికి రేషన్‌కార్డులు మంజూరు చేయాలని సిఫార్సు చేసినట్లు తెలిపారు. అర్హులైన వారందరికి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-కారంచేడు
సాధారణంగా వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని స్వర్ణ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కె వాహిలాచౌదరి అన్నారు. ఆమె మండలంలోని స్వర్ణలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిభిరంలో ఆమె పాల్గొని ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతను కూడా అలవర్చుకోవాలని ఆమె అవగాహన కల్పించారు. స్థానిక పిహెచ్‌సిలో ప్రసవాలు చేస్తున్నారని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు. ఉచిత ప్రసవంతో పాటు జెఎస్‌వై పథకంలో రూ.1000లు, మొదటి కాన్పుకు విడతలు వారీగా రూ.5వేలను, బేబీ కిట్, తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో తల్లీబిడ్డను సురక్షితంగా ఇంటికి చేర్చడం చేస్తారన్నారు. 96 మందికి షుగర్ పరీక్షలు చేసి మందులు పంపినీ చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది కెపి దాస్, ఉల్దారాణి, నాగలక్ష్మీ, ఆశాలు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని బాలుడు మృతి

వేటపాలెం : జబ్బార్ కాలనీ నుండి వేటపాలెం వైపు టివిఎస్ ఎక్స్‌ఎల్ పై వస్తున్న రామానగర్‌కు చెందిన షేక్ సుభాని స్కూటిని ఆటో ఢీ కొట్టడంతో స్కూటిపై తండ్రితో పాటు ఉన్న నాలుగేళ్ల షేక్ జనైద్ తీవ్రంగా గాయ పడినట్లు బాలుని తండ్రి షేక్ సుభాని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలుడ్ని గుంటూరు వైద్య శాలకు తరలి స్తుండగా మార్గ మధ్యలో


మృతి చెందిన బాలుడు జనైద్

అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి

కారంచేడు : ప్రతి లబ్దిదారునికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు చిత్తశుద్దిలో పని చెయ్యాలని స్థానిక ఎంపిపి మాదాసు మరియమ్మ అన్నారు. స్థానిక మండలంలో ఎంపిడిఓ ఎన్ ఉమ అధ్యక్షతన ఏర్పాటు చేసిన స్వర్ణపంచాయతీ కార్యాలయ ఆవరణలో 5వ విడత జన్మభూమి-మాఊరు గ్రామసభకు ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై అందించే పథకాలను ఎఓ నక్కా ప్రవీణ వివరించారు. స్వర్ణలో వివిధ సమస్యలపై మొత్తం 238 అర్జీలు వచ్చినట్లు ఎంపిడిఓ ఎన్ ఉమ తెలిపారు.

మార్టూరు రూరల్ : మండలంలోని రాజుపాలెం,డేగరమూడి గ్రామాలలో జన్మభూమి-మావూరు కార్యక్రమం ప్రారంభమైంది.రాజుపాలెం గ్రామంలో తహశీల్దార్ పిన్నిక మధుసూదనరావు ఆధ్వర్యంలో ప్రారంభమైన సమావేశానికి పర్చూరు నియోజకవర్గ పరిశీలకుడు ఐఏయస్ అధికారి అయిన చక్రవర్తి హాజరయ్యారుఈసభలో మొత్తం 116అర్జీలు వచ్చాయి.ముఖ్య అతిథి చక్రవర్తి చంద్రన్న సంక్రాంతి కానుకలను కొంత మందికి పంపిణీ చేశారు

ఇంకొల్లు : మండలంలోని భీమవరం గ్రామంలో మంగళవారం జరిగిన జన్మభూమి గ్రామసభకు 30 అర్జీలు అందినట్లు ఇన్‌చార్జీ ఎంపిడిఓ కె స్వరూపారాణి పేర్కొన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని స్వరూపారాణి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 59 మంది విద్యార్థులకు రూ.70,800 ఉపకారవేతనాలు అందచేశారు. దుద్దుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి జి చరణ్‌రాయ్ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సిపిఎం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-చీరాల
సిపిఎం ప్రకాశం జిల్లా మహాసభలు ఈనెల 8, 9, 10తేదీల్లో కనిగిరిలో జరుగుతున్న సందర్భంగా చీరాల సుందరయ్యభవనంలో మంగళవారం రక్తధాన శిభిరం నిర్వహించారు. ఈ శిభిరాన్ని రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజాసమస్యలపై ఆందోళనా పోరాటాలు చేస్తున్నటువంటి సిపిఎం ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలను చేయడం అభినందనీయమన్నారు. రక్తదానం చేయడమంటే ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణం పోసినట్లే అన్నారు. కార్యక్రమంలో కామాక్షి కేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ తాడివలస దేవరాజు, సిపిఎం డివిజన్ కార్యదర్శి ఎన్ బాబూరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎన్ వసంతరావు, నాయకులు దేవతోటి నాగేశ్వరరావు, కోండ్రు యోహాను, గవిని నాగేశ్వరరావు, ఎలంగేర్, పి సాయిరాం, అవ్వారు అనీల్‌కుమార్, కోండ్రు యోహాను, యుటిఎఫ్ పట్టణ కార్యదర్శి షేక్ జానీభాషా, ఐఎల్‌టిడి ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చిప్పలపల్లి శివరాజు, గోసాల సుధాకర్, పి కాలేషా, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, డివిజన్ కార్యదర్శి ఆదిత్య, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు చిరంజీవి, జి గంగయ్య, బిరుదు పిచ్చయ్య పాల్గొన్నారు

లక్ష్మీ పద్మావతి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-చీరాల
మాజీ మంత్రి జాగర్లమూడి లక్ష్మీపద్మావతి 77వ జన్మదిన వేడుకలను మనుమలు, మనుమ రాండ్రు, కార్యాలయ సిబ్బంది సమక్షంలో ఘనంగా జరుపు కున్నారు. జన్మదిన కేక్‌ను కట్ చేసి అందరికి పంచిపెట్టారు. కార్య క్రమంలో పర్చూరు ఎఎంసి మాజీ చైర్మన్ కొల్లూరు నాయుడమ్మ, చిన్నగంజాం టిడిపి అధ్యక్షులు పొద వీరయ్యచౌదరి, తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి జి లక్ష్మీపద్మావతి

5న టాలెంట్ టెస్ట్

పర్చూరు : పదవ తరగతి విద్యార్థులకు ఈనెల 5వ తేదీన టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు బిఎఆర్‌టిఎ కళాశాల కరస్పాండెంట్ భవనం శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ జి రత్నకుమారి తెలిపారు. పర్చూరులోని జూనియర్ కళాశాల ప్రాంగణంలో మధ్యాహ్నం 2గంటల నుండి 3గంటల వరకు పరీక్ష జరుగుతుందని అన్నారు. ఎక్కువ మార్కులు సాధించిన పది మందికి నగదు బహుమతులు అంద చేస్తామన్నారు

సుమలతను వరించిన పూలే అవార్డు

ఇంకొల్లు : ఆంధ్రప్రదేశ్ సర్వశిక్షా అభియాన్ వారు ప్రకటించిన సావిత్రిబాయిపూలే అవార్డు మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన మేడికొండ సుమలతను వరించింది. సుమలత గంగవరం శ్రీ వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్‌గా పని చేస్తున్నారు. ఆమె చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను గుర్తించిన సర్వశిక్షా అభియాన్ బుధవారం విశాఖపట్నంలో మంత్రి చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు.

సేవా కార్యక్రమాలలో ముందజలో రోటరీ క్లబ్

ప్రజాశక్తి - ఇంకొల్లు
పలు సేవకార్యక్రమాల కొనసాగింపులో జిల్లాకు చెందిన ఇంకొల్లు రోటరీ క్లబ్ ముందంజలో ఉందని క్లబ్ కార్యదర్శి వి రాఘవరాజు అన్నారు. స్థానిక మండలంలోని రొటరీ కార్యలయంలో నిర్వహించిన వార్షిక రోటరీ కుటుంభ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. 2016-17 కి సంభందించి నూరుశాతం సభ్యత్వ విరాళాలు సేకరించి ప్రత్యేకతను నిలబెట్టు కుందని అన్నారు. అధ్యక్షుడు షేక్ హన్ను ఆద్వర్యంలో పలు సేవకార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ అవార్డు అందుకొన్న పాత్రికేయుడు జాని భాషా దంపతులను సన్మానించారు.

డేగరమూడిలో జన్మభూమి

మార్టురురూరల్ : డేగరమూడి గ్రామ పంచాయతీ కార్యాలయంల వద్ద నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి 5అర్జీలు రాగా 32మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఐదుగురికి రేషన్‌కార్డులు పంపిణీ చేశారు.

హామీలు తప్ప అభివృద్ధి శూన్యం

- సిపిఎం మహాసభల్లో ప్రభుత్వ తీరుపై చర్చించాలని వక్తల సూచన
- సమస్యలపై మహోద్యమం కోసం తీర్మానాలు : సిపిఎం



మాట్లాడుతున్న షంషీర్ అహ్మద్

వెలుగొండ నిర్మాణంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధేదీ?

వెలుగొండ నిర్మాణం పూర్తి చేసేందుకు ఈ రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తయితే జిల్లాలో నెలకొన్న ఫ్లోరైడ్ సమస్య తీరుతుంది. తాగు, సాగు నీటి సమస్య పరిష్కారమవుతాయి. అయితే నేటికీ ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. సంవత్సరంలో పూర్తిచేస్తామని హామీ ఇవ్వడమే గాని ఆ దిశగా నిధులు కేటాయింపులు లేవు. వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తి కోసం ఉద్యమించాలి.

- షంషీర్ అహ్మద్, రిటైర్డ్ అడిషనల్ జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

'జిల్లా నుండి ప్రభుత్వం రూ.10 వేల కోట్ల ఆదాయం తీసుకుంటోంది. హామీలు తప్ప జిల్లా అభివృద్ధికి మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. సిపిఎం జిల్లా మహాసభల్లో ఈ సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయాలి' అని వక్తలు సూచించారు. సిపిఎం 12వ జిల్లా మహాసభల సందర్భంగా జిల్లాకు రూ.10వేల కోట్లు ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ మంగళవారం ఎల్‌బిజి భవన్‌లో జిల్లా సదస్సు జరిగింది. ఆ పార్టీ ఒంగోలు నగర కమిటీ కార్యదర్శి జి.రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో రిటైర్డ్ అడిషనల్ జాయింట్ కలెక్టర్ షంషీర్ అహ్మద్, సుపరిపాలనవేదిక అధ్యక్షులు టి.గోపాల్‌రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయులు, జెవివి నాయకులు కాంతారావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి మాట్లాడారు. సదస్సులో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు సిపిఎం జిల్లా మహాసభలో చర్చిం చాల్సిన అంశాలపై సూచనలు ఇచ్చారు.

పేదరికంలోనే ఐదు లక్షల కుటుంబాలు..



జిల్లాలో ఎనిమిది లక్షల కుటుంబాలుంటే వాటిలో ఐదు లక్షలు కుటుంబాలు నేటికి పేదరికంలో ఉన్నా యి. జిల్లా ఏర్పడిన ఇన్ని సంవత్సరాల కాలంలో 70 శాతం ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారు. జిల్లాకు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని 20 సంవత్సరాలుగా ప్రజలు కోరుతున్నారు. నేటికీ యూనివర్శిటి ఏర్పాటుకు ఈ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. యూనివర్సిటీ స్థలం వందెకరాలున్నా నిర్మాణం కోసం చర్యలు తీసుకోవడంలేదు. పరిపాలనలో ఈ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ప్రజల సమస్యలపై సిపిఎం మహాసభలో చర్చించాలి

-టి.గోపాల్‌రెడ్డి,
సుపరిపాలనవేదిక అధ్యక్షులు

సమస్యలపై పోరాటానికి తీర్మానాలు చేస్తాం..



జిల్లా అభివృద్ధి కోసం తొమ్మిది అంశాలను అమలు చేస్తామని టిడిపి హామీ ఇచ్చి అధికారంలోకొచ్చింది. మూడున్నరేళ్లు అయినా ఇంతవరకు ఆ హామీల అమలకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఈ జిల్లా ప్రజాప్రతినిధులు కూడా హామీలపై చంద్రబాబుతో మాట్లాడటానికి కూడా సిద్ధంగా లేరు. జిల్లాకు రావాల్సిన వాటా సాగర్‌నీరు కూడా ఇవ్వకుండా ఎగువ జిల్లాకు జిల్లాలకు ఇస్తున్నారు. వాటా నీటి కోసం భవిష్యత్‌లో మహోద్యమాన్ని నిర్మించాలి. దీనిపై సిపిఎం జిల్లా మహాసభలలో చర్చిస్తాం. అనంతపురం నుండి అమరావతి హైవే నిర్మాణం కోసం పేదల భూములను బలవంతంగా లాక్కొంటున్నారు. గంట సమయం తగ్గించడం కోసం ఈ హైవేను నిర్మిస్తున్నారు. పేదల భూములను సేకరణపై కూడా మహాసభలో చర్చిస్తాం. వెలుగొండకు మూడు సంవత్సరాల నుండి రూ.390 కోట్లు మాత్రమే కేటాయించారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే దిశగా నిధులను కేటాయించడం లేదు. ఇలా పేదలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై మహాసభలలో చర్చించి తీర్మానాలు చేస్తాం. వాటి అమలకు మహోద్యమం నిర్మించేందుకు కార్యాచరణ రూపొందిస్తాం


- పూనాటి ఆంజనేయులు,
సిపిఎం జిల్లా కార్యదర్శి

పాత కక్షల నేపథ్యంలో

రెండు గ్రూపుల ఘర్షణ

8 మందికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్


గాయపడిన పెద్దచెన్నయ్య

పాతకక్షల నేపథ్యంలో జరిగిన ఘర్షణలో రెండు గ్రూపులకు చెందిన ఎనిమిది మంది తీవ్రంగా గాయ పడ్డారు. ఈ ఘటన మార్కా పురం మండలంలోని వేముల కోట పంచాయతీలోని జంకె రామిరెడ్డి నగర్‌లో సోమ వారం రాత్రి చోటు చేసు కుంది. జెట్టిబోయిన పెద్ద చెన్నయ్య తన నివాసానికి సమీపంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. అదే కాలనీలో తెలుగుదేశం గ్రూపునకు చెందిన కన్నెబోయిన ప్రసాద్ నివాసం ఉంటు న్నారు. కన్నెబోయిన ప్రసాద్ కుటుంబీకులు-జెట్టిబోయిన పెద్ద చెన్నయ్య కుటుంబీకులకు గతంలో మనస్పర్ధలు ఉన్నాయి. ఈ నెల ఒకటిన రాత్రి మద్యం సేవించి కన్నెబోయిన ప్రసాద్ ఎవరినో దుర్భాషలాడుతున్నారు. అకారణంగా తిట్టడం ఎవరిని ఉద్దేశించి అని జెట్టిబోయిన పెద్ద చెన్నయ్య ప్రశ్నించడంతో గొడవ మొదలైంది. అదే సమయంలో కన్నెబోయిన ప్రసాద్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు కన్నెబోయిన వెంకటేశ్వర్లు, శివకుమార్, చిన్నవెంకటేశ్వర్లు, ప్రభుకుమార్ కలిసి జెట్టిబోయిన పెద్ద చెన్నయ్యతో పాటు ఆయన కుమారుడు చెన్నకేశవులపై కర్రలతో దాడి చేశారు. దీంతో పెద్ద చెన్నయ్యతో పాటు ఆయన కుమారుడు చెన్నకేశవులు, వారి కుటుంబీకులు ఆదిలక్ష్మమ్మ, అచ్చమ్మ, లింగమయ్య, చిన్నబాబు, కన్నె బోయిన అంకమ్మలు కలిసి మంగళవారం ఉదయం ఎదురుదాడికి దిగారు. దీంతో జంకె రామిరెడ్డినగర్‌లో ఉద్రిక్త వాతావారణం నెలకొంది. క్షతగాత్రులంతా మార్కా పురం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరారు. ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, టిడిపి ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి క్షతగాత్రులను పరామర్శించారు. రెండు గ్రూపుల ఫిర్యాదులపై ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యం

- కార్పొరేట్ విద్యను పెంచి పోషిస్తున్న ప్రభుత్వం
- విద్యార్థుల సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం
- నేడు , రేపు చీరాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. పాలకులు కార్పొరేట్ విద్యారంగాన్ని పెంచిపోషిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. 'డబ్బు ఉంటేనే చదువుకోండి.. లేకుంటే చదువు అవసరం లేదు' అన్న చందంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. జిల్లాలో విద్యార్థులు లేరనే పేరుతో పాఠశాలలు, హాస్టళ్లను మూసివేస్తుండటంతో పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్న పరిస్థితి నెలకొంది. జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్ఎఫ్ఐ రాజీలేని పోరాటాలు చేస్తోంది. నేటి నుంచి ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు ప్రారంభమవుతున్న సందర్భంగా ప్రత్యేక కథనం..

పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. మరుగుదొడ్లు, తాగునీరు, ల్యాబ్స్, బల్లలు వంటి సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. హాస్టల్ విద్యార్థులకు గత ఐదు సంవత్సరాలుగా మెస్‌ఛార్జీలు పెంచలేదు.

కలగానే మిగిలిపోతున్న యూనివర్శిటీ ఏర్పాటు

జిల్లాలో యూనివర్శిటీ ఏర్పాటు కలగానే మిగిలిపోతోంది. ఏడు సంవత్సరాలుగా యూనివర్శిటీ కోసం జిల్లా ప్రజలు, మేధావులు, విద్యార్థులు పోరాడుతున్నా ప్రభుత్వం నుండి స్పందన కరువైంది. జిల్లాకు మంజూరైన ట్రిపుల్‌ఐటి తరగతులు కడప జిల్లాలో నిర్వహిస్తున్నారు. ట్రిపుల్ ఐటి నిర్మాణానికి అవసరమైన నిధుల కేటాయింపులు మాత్రం జరగడం లేదు. ప్రయివేట్ విద్యాసంస్థలు విద్యార్థుల వద్ద నుండి విచ్చలవిడిగా ఫీజులు, డొనేషన్లు వసూలు చేస్తున్నా నియంత్రణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు.

పోలీసుల అణిచివేత చర్యలు

విద్యారంగ సమస్యలు పరిష్కారానికి జిల్లా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోగా విద్యార్థి ఉద్యమాలపై అణిచివేత చర్యలు కొనసాగుతున్నాయి.. ధర్నాలకు విద్యార్థులను పంపితే చర్యలు తీసుకుంటామంటూ ఆంక్షలు విధిస్తూ ఉద్యమాలు చేయనీయకుండా అడ్డుకుంటున్న పరిస్థితి జిల్లాలో నెలకొంది.

విద్యార్థులకు అండగా ఎస్ఎఫ్ఐ

జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్ఎఫ్ఐ రాజీలేని పోరాటాలు చేస్తూ


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

విద్యార్థులకు అండగా ఉంటోంది. గత సంవత్సర కాలంలో జిల్లాలో విద్యార్థి సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించింది. విద్యార్థి ఉద్యమాలపై అణిచివేత చర్యలు ఉన్నా జిల్లాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు జరిగాయి.

నేడు చీరాలలో ప్రదర్శన, బహిరంగసభ

ఈ నెల 3, 4 తేదీలలో చీరాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు జరుగుతున్నాయి. మహాసభలకు జిల్లా నుండి ప్రతినిధులు 200 మంది హాజరుకానున్నారు. మహాసభల సందర్భంగా మూడున మధ్యాహ్నం మూడు గంటలకు బాపనమ్మ కళ్యాణమండపం నుండి ప్రదర్శన ప్రారంభమవుతోంది. అనంతరం గడియార స్తంభం వద్ద బహిరంగ సభ జరుగుతుంది. సభకు మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు ముఖ్య వక్తగా పాల్గొననున్నారు.

కొన్ని పోరాటాలు

హాస్టల్ విద్యార్థుల సమస్యలపై సర్వేలు నిర్వహించి, సర్వేలో వచ్చిన సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహించారు. జులైలో జిల్లావ్యాప్తంగా మూడు రోజుల పాటు ధర్నాలు జరిగాయి. ఒంగోలు ప్రగతి భవన్‌ను ముట్టడించారు. రెండు సార్లు చలో కలెక్టరేట్ నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండల, తాలూకా కేంద్రాలలో ధర్నాలు, ముట్టడిలు నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ వద్ద పలు సార్లు పోరాటాలు నిర్వహించారు. సమస్యలు పరిష్కారం కోసం విద్యాసంస్థల బంద్ చేపట్టారు. కార్పొరేట్ పాఠశాలలో విద్యార్థుల ఆత్మహత్యలపై జిల్లాలో నిరసనలు, విద్యాసంస్థల బంద్, ధర్నాలు నిర్వహించారు. నవంబర్‌లో విద్యార్థుల సమరబేరి యాత్ర పేరుతో జీపుయాత్ర నిర్వహించారు. ఈ యాత్ర చివరిరోజున వందల మంది విద్యార్థులతో కలెక్టరేట్‌ను ముట్టడించారు.

విద్యార్థుల సమస్యలపై చర్చిస్తాం..

సిహెచ్.సుధాకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

నేడు, రేపు చీరాలలో జరిగే జిల్లా మహాసభలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తాం. సమస్యల పరిష్కారం కోసం అనుసరించాల్సిన కార్యాచరణను రూపొందిస్తాం.

నగరానికి చేరుకున్న సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - ఒంగోలు క్రైం

పర్యావరణ పరిరక్షణపైనా, ఆరోగ్యంపైనా ప్రజలలో చైతన్యం కలిగించేందుకు శ్రీకాకుళం నుండి అనంతపురం వరకు ఎస్‌పిఎఫ్ బెటాలియన్ నిర్వహిస్తున్న సైకిల్ యాత్ర మంగళవారం ఒంగోలు నగరానికి చేరుకుంది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.జి.ప్రియదర్శిని స్థానిక తాలూకా పోలీస్ స్టేషన్‌లోని కల్యాణమండపం నుండి మంగళవారం జిల్లాలో ప్రారంభించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండర్ కె.నరసింహారావు మాట్లాడుతూ నివాసప్రాంతాల నుండి కార్యాలయానికి వచ్చేందుకు సైకిల్‌ని మాత్రమే వాడుతున్నామని తెలిపారు. సైకిల్ వాడకం వల్ల మందుల వాడకం తగ్గిందన్నారు. ప్రతి రోజూ 5 నుండి 10 కిలోమీటర్ల వరకు సైకిల్‌పై ప్రయాణిస్తున్నామన్నారు. యాత్రలో భాగంగా మార్గమధ్యంలో పాఠశాలలను, కళాశాలలను సందర్శించి విద్యార్థులకు సైకిల్ వాడకం పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు.


జిల్లాలో ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి ఎంజి.ప్రియదర్శిని


ర్యాలీలో పాల్గొన్న స్పెషల్ పోలీస్ బెటాలియన్

ఎస్‌బిఐలో ఆధార్ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

ఎస్‌బిఐ మెయిన్‌బ్రాంచిలో రీజినల్ చీఫ్ మేనేజర్ పి.కృష్ణమూర్తి ఆధార్‌సేవల విభాగాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మెయిన్ బ్రాంచి చీఫ్ మేనేజర్ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆధార్‌లోని పేరు తప్పులను, పుట్టినరోజు తేడాలను, చిరునామా మార్పులను సరిచేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ బ్రాంచి మేనేజర్ కె.జానకిరామయ్య, డిప్యూటీ మేనేజర్ నాగరాజు, స్టాఫ్ యూనియన్ బ్రాంచి కార్యదర్శి రాజశేఖర్, ఆధార్ సూపర్‌వైజర్ సిహెచ్ సురేష్, ఆధార్ డైరెక్టర్ హరింద్ర, మధుబాబు సిబ్బంది పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరులో జిల్లాకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి-ఒంగోలు ఎడ్యుకేషన్

రాష్ట్రంలో బయోమెట్రిక్ హాజర్‌లో ప్రకాశం జిల్లా ప్రథమ స్థానం సాధించిందని డిఇఒ విఎస్.సుబ్బారావు తెలిపారు. 3,100 పాఠశాలల్లో జిల్లా హాజరు 93.70 శాతంతో ఉందన్నారు. ఐటి సెల్ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనివాస్, రమేష్‌లు డిఇఒ, జిల్లా ఎఎస్‌ఒ కృష్ణకుమార్, జిల్లా నోడల్ పర్సన్ అజీంబాషా, మండల నోడల్ పర్సన్స్‌ను అభినందిస్తూ రాబోయే రోజుల్లోనూ ఇలా అభివృద్ధిని సాధించాలని కోరారు.

4న డిఎస్‌సి అభ్యర్థుల సమావేశం

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

ఈనెల 4న డిఎస్‌సి 2008 సెలెక్టడ్ అభ్యర్థులు ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో జరిగే సమావేశానికి రావాలని డిఎస్‌సి 2008 సెలెక్టెడ్ అభ్యర్థులు మస్తాన్, వలి ఒక ప్రకటనలో తెలి పారు. ఒంగోలులో ఉన్న ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్‌రావుకు సమస్యపై విన్నవించనున్నట్లు తెలిపారు. పాత డిఎస్‌సిలపై ప్రభుత్వం ఎమ్మె ల్సీల కమిటీ వేసిందన్నారు. ఈ కమిటీ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరనున్నట్లు తెలి పారు. అభ్యర్థులందురూ పాల్గొనాలని కోరారు.

తైక్వాండో పోటీల్లో మెరిసిన 'శ్రీ సూర్య' విద్యార్థి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వెంకట కృష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో స్థానిక అన్నవరప్పాడులోని శ్రీసూర్య విద్యానికేతన్ విద్యార్థికి బంగారు పతకం లభించినట్లు పాఠశాల కరస్పాండెంట్ రామాల వెంకట రామిరెడ్డి తెలిపారు. తమ పాఠశాల పదో తరగతి విద్యార్థి దేవరపల్లి అభినయ్‌రెడ్డి రెండు విభాగాలలో బంగారు పతకాలు సాధించారన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో జరిగిన సభలో విజేత అభినయ్‌రెడ్డిని ప్రిన్సిపల్ ఐ.రంగనాయకమ్మ, అకడమిక్ డైరెక్టర్ బిఎస్‌ఆర్ శాస్త్రి, ఉపాధ్యాయులు అభినందించారు.


డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

'ఎపిఎస్ఇబి' డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

ఎపిఎస్‌ఇబి ఇంజినీర్స్ అసోసియేషన్ డైరీని విద్యుత్ శాఖ ఎస్‌ఇ సుబ్బరాజు మంగళవారం ఆవిష్కరించారు. డైరీని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు ఉషారాణి, కె.వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రామకృష్ణ, టి.శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, హరిబాబు, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, కె.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

జన్మభూమి సభల్లో అధికారులను నిలదీసిన ప్రజా సంఘాలు

ఒంగోలుటౌన్ : నగరంలో మంగళవారం 1 నుండి 5 డివిజన్‌లలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ప్రజా సమస్యలపై ఎమ్మెల్యేను, అధికా రులను, ప్రజాసంఘాల నాయకులు నిలదీశారు. ఈ సంద ర్భంగా సిఐటియు నగర అధ్యక్షులు తంబి శ్రీనివాసులు మాట్లా డుతూ నగరంలో ప్రజా సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. గత జన్మభూమిలో ఇచ్చిన అర్జీలకు ఇంతవరకు పరిష్కారం చూపలేదన్నారు. ఇళ్లస్థలాల సమస్యను పరిష్క రించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు జె.అచ్చయ్య, రజకవృత్తిదారులు నాయకులు బి.అమ్మయ్య, ఐద్వా నాయకులు సిహెచ్.వెంకటేశ్వరమ్మ, ఎస్‌కె రేష్మి, పౌరసంఘాల సమాఖ్య నాయకులు కె.శ్యామ్, డివైఎఫ్‌ఐ నాయకులు ఉన్నారు.

ఒంగోలుసబర్బన్ : ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని 1, 2, 3 డివిజన్లలో మంగళవారం జన్మభూమి – మాఊరు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. సమస్యల పరిష్కారానికి ప్రణాళికా ప్రకారం వ్యవహరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, ఇంజినీర్ డి.సుందరామిరెడ్డి, జన్మభూమి స్పెషల్ ఆఫీసర్ విజయ్‌మోహన్ పాల్గొన్నారు.

జన్మభూమి షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-ఒంగోలు ఎడ్యుకేషన్


2 నుంచి 11 వరకు జరిగే 'జన్మభూమి–మాఊరు' కార్యక్రమాల్లో ప్రతి పాఠశాల పాల్గొనేలా డివైఇఒలు, ఎంఇఒలు ఉపాధ్యాయులకు ఆదేశాలు ఇవ్వాలని డిఇఒ పేర్కొన్నారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు, వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వపోటీలు, కల్చరల్ ప్రోగ్రాంలు నిర్వహించాలన్నారు.

5న 'విద్యాకాసం' కార్యక్రమం నిర్వహించాలన్నారు. సైన్స్ ప్రదర్శనలు, ఉపన్యాసాలు, నాటికలు, పాటల పోటీలు, అమ్మకు వందనం, రంగోళి, చిన్న పిల్లలతో రైమ్స్ నిర్వహించాలని ఆదేశించారు. అదేరోజు పాఠశాలలో జరిగే కార్యక్రమాలు, ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు తెలిపాలన్నారు. డ్రాప్ అవుట్ విద్యార్థులను తిరిగి చేర్చుకునేందుకు ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. వారు తప్పక హాజరయ్యే విధంగా చూడాలన్నారు.

పట్టాల మార్పిడిని సరళతరం చేయాలని వినతి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

నగరంలో డికె పట్టాల మార్పిడిని సరళతరం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావును ఒంగోలు సిటిజన్స్ ఫోరం నాయకులు కొల్లా మధు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఒంగోలు నగరంలో సొంతదారుల పేరుపై డికె పట్టాలు మార్చాలని సంకల్పించటం, సిఎం ద్వారా ప్రయత్నిం చటం, అందరిని అర్జీలు పెట్టుకోవాలని ప్రోత్సహించటం అభినందనీయమన్నారు. డికె పట్టా నకలు తప్పనిసరి చేయాలని, అవి లేని సమయంలో కరెంట్ బిల్లు, మున్సిపల్ పన్ను, వంటి వాటిని పరిగణలోకి తీసుకోమని, డికె నకలు ఎందుకు ఇవ్వలేకపోతున్నారో వివరణ కోరాలని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల అందరి ఆధార్ కార్డు నకలు కావాలని చెప్పటంతో ప్రజలకు చాలా అనుమానాలు ఉన్నాయన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలన్నింటికీ అనర్హులమవుతామని భావిస్తున్నారన్నారు. మిగతా వారి పేరుతో ఏవో కొన్ని ఆస్తులు ఉండి ఉంటాయని, అప్పుడు డికె మార్చరనే భావన ప్రజలలో ఉందని తెలిపారు. ఈ అనుమానాలను వెంటనే తొలగించి ఎవరి పేరున డికె మార్చాలో వారి ఆధార్‌ను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఈ సూచనలను వెంటనే పరిగణలోకి తీసుకొని తహశీల్దార్‌తో ప్రత్యేక ప్రకటన చేయించాలని, జన్మభూమి సభలలో కూడా ఈ అర్జీలు స్వీకరించాలని ఆయన కోరారు.



గొరంట్ల - 1	ఒక్కక్షణం
గొరంట్ల - 2	మళ్లీరావా, ప్రాజెక్ట్ జడ్
గొరంట్ల - 3	టైగర్ జిందా హై, ఎంసిఎ
గొరంట్ల - 4	జుమాంధి
రత్నమహల్	ఒక్కక్షణం
గోపి	ఎంసిఎ
తులసీరాం	పాజెక్ట్ జడ్
సత్యం	హలో
జయరాం	రాజా ది గ్రేట్
సాయిసరోజ్	టు కంట్రీస్

స్పోర్ట్స్ మీట్‌లో గౌతమి ముందంజ

ఒంగోలు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 28, 29 తేదీలలో నిర్వహించిన ఆటల పోటీలలో గౌతమి స్కూలు విద్యార్థులు 15 బహుమతులు కైవశం చేసుకున్నట్లు కరస్పాండెంట్ పి.కిషోర్‌కుమార్ తెలిపారు. సీనియర్ లాంగ్ జంప్ విభాగంలో సుదర్శన్, పరుగు పందెంలో ద్వితీయ స్థానం, అబ్దుల్ కలాం స్లో సైక్లింగ్‌లో తృతీయ స్థానం, శివ షాట్‌పుట్‌లో తృతీయ స్థానం సాధించారన్నారు. జూనియర్ విభాగం స్కిప్పింగ్‌లో తేజస్వినికి మొదటి స్థానం, మ్యూజికల్ ఛైర్స్‌లో సౌమ్యకి మొదటి స్థానం సాధించారన్నారు. స్లో సైక్లింగ్‌లో మణికంఠకు మొదటి స్థానం, షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం, పరుగు పందెంలో అజయ్‌కి మొదటి స్థానం, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానం, టగ్–ఆఫ్ –వార్‌లో బాలికలకు మొటి స్థానం, నృత్య పోటీలో బహు మతులు సాధించారన్నారు. విజేతలను క రస్పాండెంట్ పి.కిషోర్‌కుమార్, అభినందించారు.



టమోట	10	మునక్కాయలు	120
వంకాయలు	20- 24	బంగాళాదుంప	16
దోసకాయలు	18	బీట్‌రూట్	30
బెండకాయలు	32	పొట్లకాయ	24
దొండకాయలు	15	పెద్దచిక్కుడు	38
కాకర	25 - 34	గోరుచిక్కుడు	24
బీరకాయలు	30	చామదుంప	34
క్యాబేజీ	20	క్యారెట్	48
బీన్స్	34	సొరకాయ	16
పచ్చిమిర్చి	22	అరటికాయ	6

బస్టాండును అభివృద్ధి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-చీమకుర్తి


శ్రమదానం చేస్తున్న నాయకులు

స్థానిక ఆర్‌టిసి బస్‌స్టాండ్ ఆవరణను పార్కుగా అభివృద్ధి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు డిమాండ్ చేశారు. సిపిఎం 12వ మహాసభలను పురస్కరించుకొని మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు బస్టాండ్ ఆవరణలో శ్రమదానం చేశారు. బస్టాండ్ వెనుక పరిసరాలు పిచ్చి మొక్కలు పీకేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు మాట్లాడుతూ స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉందని, మందుబాబులకు అడ్డగా మారిందని పేర్కొ న్నారు. అసాంఘిక కార్యక్రమాలకు ఆవాసంగా మారిందన్నారు. ఆర్‌టిసి, నగర పంచాయతీ, స్వచ్ఛంద సేవా సంస్థలు ఇప్పటికైనా స్పందించి బస్టాండ్ ఆవరణను అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, మండల కమిటీ సభ్యులు పల్లాపల్లి ఆంజనేయులు, కంకణాల వెంకటేశ్వర్లు, తొట్టెంపూడి రామారావు, బొడ్డు ఓబులేషు, శీలం ఆదినారాయణ, పులి ఓబులరెడ్డి, లింగంశెట్టి వెంకటరావు, మాదాల నారాయణ, బి.శ్రీను, క్రిష్టిపాటి కోటిరెడ్డి పాల్గొన్నారు.

పొదిలిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని

ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతి

ప్రజాశక్తి-పొదిలి

పొదిలిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కె. చెంచునారాయణ, ఎస్‌వికెపి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జిసి. సుబ్బారావు, ఆర్యవైశ్య మండల సెక్రటరీ జి. శ్రీనివాసరావు, వాసవీ 12 ఫ్రెండ్స్ అధ్యక్షులు కృష్ణమూర్తి, ఆర్యవైశ్య సంఘం నాయకులు సోమిశెట్టి చిరంజీవి, సిపిఎం నాయకులు ఎం. రమేష్ ఆధ్వర్యంలో దర్శిలో నిర్వహించిన జన్మభూమి-మా ఊరు గ్రామ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు పొదిలి మండలం, పట్టణంలో తాగు, వాడుక నీటి సమస్యకు తీవ్రంగా ఉందని ముఖ్యమంత్రికి వివరించారు. పొదిలిలో 35 వేలు, గ్రామాలలో మరో 35వేల మంది ప్రజలు నివసిస్తున్నారని వారందరికీ తాగునీటి సమస్యగా ఉందన్నారు. గతంలో 30 అడుగుల లోతులోనే భూగర్భ జలాలు ఉండేవని, వర్షాభావం కారణంగా భూగర్భజలాలు అడుగంటినట్లు తెలిపారు. 600 నుంచి 800 అడుగుల లోతున బోర్లు వేసిన నీరు పడటం లేదని వివరించారు. భూగర్భ జలాలు అడుగంటి 80శాతంకు పైగా బోర్లు అడుగంటాయన్నారు. రోజు వారి అవసరాలు మరియు తాగునీటికి ప్రజలు ట్యాంకర్లపై ఆధారపడి జీవిస్తున్నారని వివరించారు. ఇటీవల వర్షాలు పడ్డాయనే సాకుతో ట్యాంకర్ల సంఖ్య తగ్గించడంతో నీరు సరిపోక ప్రజలు కుస్తీ పడుతున్నారన్నారు. ట్యాంకర్లు సకాలంలో రాక ప్రజలు రోడ్డెక్కుతున్నారన్నారు. జిల్లాలోనే ప్రధానంగా 1984లో నెదర్‌ల్యాండ్ ప్రభుత్వ ఆర్థిక సహాయంతో చేపట్టిన ఎస్‌ఎపి పథకానికి కాలం చెల్లి ప్రజల అవసరాలు తీర్చలేకపోతుందన్నారు. దీంతో ప్రజలు ఫ్లోరైడ్ నీటి బారిన పడి కిడ్నీ, నాడి, కాళ్లు, ఎముకల సంబంధిత వ్యాధులతో సతమత మవుతున్నారన్నారు. మండలంలోని కొన్ని గ్రామాల ప్రజలు ప్రతి సంవత్సరం అనారోగ్యం పాలై ఒక్కొక్క కుటుంబం రూ.1.5 లక్షల నుంచి రూ.3లక్షల వరకు వైద్యానికి ఖర్చు చేస్తున్నారన్నారు. పొదిలి పట్టణంలో నీటి సమస్య తీవ్రం కావడంతో ఒక్కొక్క కుటుంబం వెయ్యి లీటర్ల నీటిని రూ.250 కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఆ నీరు రెండు రోజులకు కూడా సరిపోవడం లేదన్నారు. ప్రతి కుటుంబం నీటి కోసం నెలకు రూ. 2,500-3,500 వరకూ ఖర్చు చేస్తుందన్నారు. రోజు వారి ట్యాంకర్ నీటి కోసం ప్రతి కుటుంబంలో ఒకరు పని మానుకుని ఎదురు చూడాల్సి వస్తుందన్నారు. ఇలాంటి దుస్థితిలో పొదిలి తాగునీటి సమస్యలను గుర్తించి ఇక్కడికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న నాగార్జున సాగర్ కుడికాలువ నుండి పెద్ద చెరువుకు నీటిని సరఫరా చేయాలన్నారు. అందు కోసం గ్రామీణ నీటి సరఫరా అధికారులు రూ.115 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద జాతీయరహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు అంకయ్య(36) మృతిచెందాడు. అంకయ్య మృతదేహాన్ని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ నగర వర్కింగ్ సెక్రటరీ శ్రీరామ శ్రీనివాసరావు రిమ్స్‌లో సందర్శించారు.



వరలక్ష్మమ్మను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పీడీ వరలక్ష్మమ్మకు పూలే అవార్డు

ప్రజాశక్తి-పొదిలి

స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పీడీగా విధులు నిర్వహిస్తున్న దోర్నాల వరలక్ష్మమ్మ జ్యోతిబాయి పూలే అవార్డుకు ఎంపికైంది. విద్యార్థినులకు క్రీడల పట్ల ఆసక్తి పెంచడం, పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సంఖ్య పెంపుదలకు కృషి చేసినందుకు గానూ ఆమె ఈ అవార్డు లభించింది బుధవారం విశాఖ పట్నంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖమంత్రి గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా వరలక్ష్మమ్మ అవార్డు అందుకోనున్నారు. రాష్ట్రంలో ముగ్గురు పీడీలకు అవార్డులు ప్రకటించగా అందులో వరలక్ష్మమ్మ ఒకరు. ఈ సందర్భంగా మంగళవారం వరలక్ష్మమ్మను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిహెచ్.సుబ్బారావు, ఉపాధ్యాయులు ఎస్ శ్రీలక్ష్మి, జ్యోతి, శైలజ, అరుణశ్రీ, గోపిశెట్టి వెంకటేశ్వర్లు, సుజాత, శివ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బాబూరావు శుభాకాంక్షలు తెలుపుతున్న బెల్లంకొండ

ఎమ్మెల్యే కదిరికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-పొదిలి

కనిగిరి ఎమ్మెల్యే కదిరి బాబూరావును బెల్లంకొండ విద్యా సంస్థల చైర్మన్ బెల్లంకొండ శ్రీనివాస్ మంగళవారం కలసి శుభాకాంక్షలు తెలిపారు.

లారీని ఢీకొన్న కారు

- ఒకరు దుర్మరణం

- నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ముందువెళ్తున్న లారీ అకస్మాత్తుగా ఆగడంతో వెనుక నుండి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు, ఈ ఘటన మార్టూరు సమీపంలోని బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు కథనం ప్రకారం...అద్దంకి పట్టణానికి చెందిన సిహెచ్.కృష్ణమోహన్(37) గతంలో పలు దినపత్రికలలో విలేకరిగా పనిచేశాడు. ప్రస్తుతం విజయవాడ ఎసిబి కోర్టులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో విజయవాడ నుంచి స్వగ్రామం అద్దంకికి బాడుగ కారులో వస్తున్నారు. ఆ కారులో ఉలవపాడు సమీపంలోని కరేడు ఎపి రెసిడెన్సియల్ ప్రిన్సిపల్ ఉడికి పెద్దిరాజు, గుంటూరు సమీపంలోని అంకిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఉరుసు రాములు, పార్వతి, వారి మనుమడు దుర్గ, ఒంగోలు ఎన్‌జిఒ కాలనీకి చెందిన కారు డ్రైవర్ కృష్ణారెడ్డి ఉన్నారు. ఈ కారు మార్టూరు సమీపంలోని టోల్‌ప్లాజా వద్దకు రాగానే ముందు వెళుతున్న లారీ అకస్మాత్తుగా ఆగింది. దీంతో కారు లారీని ఢీకొంది. దీంతో కారులోని వారంతా గాయపడ్డారు. ముందు కూర్చున్న కృష్ణమోహన్ తీవ్రంగా గాయపడ్డాడు. హైవే ఆంబులెన్స్‌లో క్షతగాత్రులను చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే కృష్ణమోహన్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రులనుమెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. మృతుడు కృష్ణమోహన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



ప్రమాదంలో నుజ్జు అయిన కారు

అర్హులకు పింఛన్లు అందలేదని

గ్రామసభలో ఎంపిటిసి ఆగ్రహం

ప్రజాశక్తి-పొదిలి

ఐదో విడత జన్మభూమి-మన ఊరు గ్రామ సభలు మొక్కుబడిగా సాగుతున్నాయి. అందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ సభలు అసంతృప్తికి వేదికలుగా మారుతున్నాయి. మండలంలోని వేలూరు గ్రామసభలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. అర్హులకు పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు కాక పోవడం పట్ల ఎంపిటిసి శ్రీను తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్హులు గ్రామ సభల్లో అర్జీలు ఇచ్చినప్పటికీ వారికి పథకాలు దక్కకుండా జన్మభూమి కమిటీ సభ్యులు అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిటిసి వ్యాఖ్యలతో సభ రసాభాసగా మారింది. ఈ సందర్భంగా ఎంపిపి కె. నరసింహారావు, జడ్‌పిటిసి సాయి రాజేశ్వరరావు జోక్యం చేసుకుని పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఏక పక్షంగా ప్రభుత్వ పథకాలను మంజూరు చేస్తే గ్రామ సభల్లో నిరసనలు తప్పవన్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకుని ప్రభుత్వ పథకాలు అర్హులకు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కాటూరి వెంకట నారాయణబాబు. మండల జన్మభూమి కమిటీ అధ్యక్షుడు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఇఒఆర్‌డి రంగనాయకులు పాల్గొన్నారు

మర్రిపూడి : టిడిపి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. మండల పరిధిలోని గుండ్ల సముద్రం, కెల్లంపల్లి గ్రామాలలో మంగళవారం జన్మభూమి-మాఊరు గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ రేషన్‌కార్డులు, పింఛన్లు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఎర్రమోతు సుశీల, జడ్‌పిటిసి టి. వెంకట నరసింహం, వైస్ ఎంపిపి జి. హనుమారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు చేరెడ్డి నరసారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ శరత్

ఐద్వా క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మార్కాపురం

ఐద్వా మహిళా సంఘం మార్కాపురం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన 2018 క్యాలెండర్‌ను సీతారామశాస్త్రి హాస్పటల్స్ అధినేత డాక్టర్ బి.శరత్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా డివిజన్ కార్యదర్శి కె.కళావతి, గాలి భూలక్ష్మి, డి.శివకుమారి, రాచకుంట్ల సుధామణి, మొలకల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో డాక్టర్ల బృందం

మెడికల్ కౌన్సిల్ బిల్లును ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రస్తుతం అమలులో ఉన్న మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ పేరుతో తాజాగా పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు డాక్టర్లు నల్లబ్యాడ్జీలతో పట్టణంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ మార్కాపురం అధ్యక్షుడు డాక్టర్ ఎం.మాధవరావు, కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్, డాక్టర్ జి.పిచ్చిరెడ్డి, డాక్టర్ ఎస్.రవీంద్రారెడ్డి, డాక్టర్ విజయ్, డాక్టర్ బి.శరత్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల చట్టం -2016 పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి-పొదిలి

వికలాంగులకు ప్రభుత్వం కేటాయించిన చట్టాలను అమలు చేసేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని గృహ నిర్మాణ శాఖ డిఇ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక హౌసింగ్ కార్యాలయంలో వికలాంగుల చట్టం-2016 అనే పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వికలాంగుల కోసం ప్రభుత్వం అనేక చట్టాలు అమలు చేస్తుందన్నారు. వికలాంగులు ఆ చట్టాలను వినియోగించుకోవాలన్నారు. చట్టాలను వినియోగించుకోని అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ నారాయణరెడ్డి, సిబ్బంది మల్లికార్జునరావు, వికలాంగుల సేవా సమితి జిల్లా అధ్యక్షులు నరసింహారావు, కార్యదర్శి మదార్‌వలి, వికలాగులు తదితరులు పాల్గొన్నారు.



వికలాంగుల చట్టం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డిఇ

ధ్వంసమవుతున్న కాలువగట్లు

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
-తారురోడ్డు వేయాలని కోరుతున్న రైతులు

ప్రజాశక్తి-చీమకుర్తి

గ్రానైట్ భారీ వాహనాలతో కాలువ గట్లు ధ్వంసమవుతున్నాయి. గ్రానైట్ గనుల పరిధిలో కారుమంచి, మైలవరం, ఆర్ఎల్‌పురం మైనరు కాలువలు ఉన్నాయి. కారుమంచి కాలువకు రెండు వైపులా గ్రానైట్ గనులు, కంకర మిల్లులు, పాలిషింగ్ యూనిట్లు విస్తరించి ఉన్నాయి. పాతికేళ్లుగా ఈ కాలువ గట్టుపై భారీ వాహనాలు నిత్యం తిరుగాడుతుంటాయి. గట్లు దెబ్బతింటున్నాయని రైతులు, పలువురు ఎన్నోసార్లు విన్నవించినా నేటికీ ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదు. ఇటీవల రైతులు కట్టకు అడ్డంగా రాళ్లు పెట్టి పోరాడారు. దిగివచ్చిన గ్రానైట్ యజమానులు కారుమంచి కాలువ కుడి గట్టుపై తారురోడ్డు వేయడానికి ముందుకొచ్చారు. రోడ్డు వేస్తున్నారు. మిగిలిన ఎడమ గట్టు, మైలవరం, ఆర్ఎల్‌పురం కాలువలను పట్టించుకోవడం లేదు. దీంతో ఆయా కాలువ గట్లు బాగా దెబ్బతింటున్నాయి. ప్రధానంగా మైలవరం కాలువ కుడి గట్టుపై దాదాపు ఆరు క్వారీలకు చెందిన భారీ


దెబ్బతిన్న మైలవరం కాలువ గట్టు


కారుమంచి కాలువపై వేసిన తారురోడ్డు

డంపర్లు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. కాలువ గట్లలో నాలుగైదు అడుగుల లోతు గుంతలు ఏర్పడ్డాయి. ఆగుంతల్లో కనీసం మట్టిని కూడా వేయకుండా రాకపోకలు సాగిస్తున్నారు. ఎడవ కాలువగట్టును అనుకుని ఓ ప్రముఖ కంపెనీ క్వారీయింగ్ చేస్తుంది. కాలువ గట్లు ధ్వంసమై కాలువ కుదించుకు పోయింది. ప్రస్తుతం కాలువలో నీరు ఉధృతంగా పారుతుంది. గట్టుపై లేచే దుమ్ము తెరలు నీళ్లలో పడి అవి కలుషితమవుతున్నాయి. వాటి మరమ్మతులు గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఫలితంగా త్వరలో కాలువ గట్లు పూర్తిగా ధ్వంసమయ్యే ప్రమాదం పొంచి ఉంది. కారుమంచి కాలువ గట్టుపై లాగానే మైలవరం కాలువ గట్టుపై గ్రానైట్ యజమానులు తారురోడ్డు వేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కాలువను కాపాడుకోకపోతే గట్లు పూర్తిగా ధ్వంసమయ్యే ప్రమాదముందని వారు పేర్కొంటున్నారు. అధికారులు గ్రానైట్ యజమానుల నుంచి తాయిలాలు అందుకుంటూ, కాలువ రక్షణ చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.

నేడు మంత్రి నారాయణ రాక

ప్రజాశక్తి-చీమకుర్తి

రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ బుధవారం చీమకుర్తిలో జరిగే జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో పాల్గొననున్నారు. మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు, టిడిపి పట్టణ కార్యదర్శి ఎస్.ఆంజనేయులు ఆయన పట్టణానికి రానున్నట్లు తెలిపారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో జరిగే జన్మభూమి-మాఊరు సందర్భంగా జరిగే కార్యక్రమాలలో పాల్గొంటారని తెలిపారు. ప్రజలు విరివిగా పాల్గొనాలని కోరారు.

మాజీ సర్పంచి పంజా వెంకటేశ్వర్లు మృతి

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని గాడిపర్తివారిపాలెం గ్రామ మాజీ సర్పంచి పంజా వెంకటేశ్వర్లు(76) మంగళవారం మృతి చెందారు. మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు గంగిరెడ్డి ఓబులరెడ్డి, సర్పంచి ఎస్ సుబ్బరామిరెడ్డి, చీమకుర్తి పట్టణ వైసిపి అధ్యక్షులు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, ఎంపిటిసి ఎస్.విజయభాస్కరరెడ్డి, సొసైటీ అధ్యక్షులు బత్తుల వెంకటసుబ్బారెడ్డి, సంతనూతలపాడు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వేమా శ్రీనివాసరావు, అణగారిన కులాల ఐక్యవేదిక నాయకులు ఎస్‌కె.ఖాదర్‌బాషా, పేరం శ్రీనివాసరావులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.


నట్టల నివారణ మందు తాగిస్తున్న తహశీల్దార్ నీలకంఠేశ్వరరావు

పశు వైద్యశిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

జన్మభూమి కార్యక్రమం సందర్భంగా మండలంలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్యశిబిరాన్ని తహశీల్దార్ నీలకంఠేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. డీడీ మురళీకృష్ణ పశువులతో నట్టల నివారణ మందు తాగించారు. 60 పశువులకు వైద్యచికిత్సలు చేశారు. కార్యక్రమంలో పేర్నమిట్ట పశువైద్యులు చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముక్కోటి వేడుకలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని స్థానిక శివాలయంలో మంగళవారం శివముక్కోటి వేడుకలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు బుచ్చిబాబుశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పాలక కమిటీ చైర్మన్ ఎస్‌వి.సుబ్బారావు, మాజీ సర్పంచి నరసింహస్వామి కుమారులు, కుటుంబ సభ్యులు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రోడ్డు ధ్వంసంపై స్థానికుల ఆందోళన

ప్రజాశక్తి-సంతనూతలపాడు

రిలయన్స్ కేబుల్ నిర్మాణం కోసం కొత్తరోడ్డు మార్జిన్‌ను అధికారులు ధ్వంసం చేయడంతో స్థానికులు మంగళవారం ఆందోళన చేశారు. సంబంధిత అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఈ సందర్భంగా కామేపల్లివారిపాలెం దళిత కాలనీవాసులు మాట్లాడుతూ సంబంధిత అధికారులు రోడ్డు మార్జిన్‌కు మరమ్మతులు చేయించి, పునరుద్ధరించకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. రూ.2 కోట్ల నిధులతో కొత్తగా నిర్మించిన తారు రోడ్డు మార్జిన్‌ను ధ్వంసం చేయడం సబబుకాదని హితవు పలికారు. ఇకనైనా రోడ్డు వెంబడి తవ్వకాలను ఆపకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని వారు హెచ్చరిస్తున్నారు.

పాఠశాలల్లో స్వీట్లు పంపిణీ

ప్రజాశక్తి-చీమకుర్తి

అభయకళారాధన సంస్థ ఆధ్వర్యంలో పలు పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. స్థానిక ఎస్‌కెఆర్ బధిరుల, లయన్స్ అంధుల, ఎస్‌సి బాలికల వసతి గృహాలలో విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో వక్తలు మాట్లాడుతూ అభయకళారాధన సంస్థ ఆధ్వర్యంలో 865 సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. సంస్థ అధ్యక్షులు మద్దాలి మాధవరావును అభినందించారు. కార్యక్రమాలలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.గంగాధరరావు, ఒంగోలు గెలాక్సీ అధినేత చలువాది బదరీనారాయణ, పాలడెయిరీ మారం రామిరెడ్డి, జాలా మోహన్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు గంగిరెడ్డి ఓబులరెడ్డి, జి.జయరామిరెడ్డి, పి.వెంకటసుబ్బయ్య, దొంతు శ్రీనివాసరావు, ఇనగాల శ్రీనివాసరావు, పాఠశాల కరస్పాండెంట్ ఎస్.అంజిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రాసన్ కంపెనీ మేనేజర్ ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.


విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

గ్రానైట్ వర్కర్స్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక పంగలూరి కృష్ణయ్య భవనంలో ది చీమకుర్తి ఏరియా గ్రానైట్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) 2018 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సిఐటియు జిల్లా నాయకులు కాలం సుబ్బారావు మంగళవారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సిఐటియు డివిజన్ ఉపాధ్యక్షులు పూసపాటి వెంకటరావు, గ్రానైట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జా వీరాంజనేయులు, బొడ్డు ఓబులేషు, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు దేవరపల్లి రామారావు, పల్లాపల్లి ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ నాయకులు కంకణాల వెంకటేశ్వర్లు, యూనియన్ నాయకులు ఎల్.వెంకటరావు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా నాయకులు

జన్మభూమిలో సమస్యల ఏకరువు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన జన్మభూమిలో సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అధికారులను నిలదీశారు. బిల్లులు చెల్లించాలని వాగ్వివాదానికి దిగారు. అన్ని సమస్యలను పరిష్కరిస్తామని నాయకులు హామీ ఇచ్చారు.

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తున్నామని జడ్‌పిటిసి సభ్యులు తన్నీరు శ్రీనివాసరావు అన్నారు. మండలపరిధిలోని మంగమూరు, కామేపల్లివారిపాలెం గ్రామాలలో మంగళవారం జరిగిన జన్మభూమి కార్యక్రమాలలో ఆయన పాల్గొని ముఖ్య ప్రసంగం చేశారు. మంగమూరు సభకు తహశీల్దార్ నీలకంఠేశ్వరరావు, కామేపల్లివారిపాలెం సభకు సర్పంచి కామేపల్లి పుష్పావతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తన్నీరు శ్రీనివాసరావు మాట్లాడారు.

బిల్లులు చెల్లించలేదు

"మరుగుదొడ్లు నిర్మించుకోమన్నారు. సొంత డబ్బులతో వాటిని కట్టుకున్నాం. బిల్లు వచ్చాయని తెలిపారు. ఇంతవరకు బిల్లులు చెల్లించలేదు." అని మంగమూరు దళిత కాలనీకి చెందిన పలువురు బాధితులు జన్మభూమిసభలో అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు వారిని సముదాయించి అర్జీలు స్వీకరించి పంపించేశారు. కార్యక్రమంలో ఎంపిపి మాదాల అనిత, జన్మభూమి కమిటీ నాయకులు మాదాల రమేష్, మండలశాఖల అధికారులు పాల్గొన్నారు.


బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు


కనపర్తి జన్మభూమిలో పాల్గొన్న అధికారులు

నాగులుప్పలపాడు : మండలంలోని కనపర్తి, అమ్మనబ్రోలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన జన్మభూమి - మాఊరి కార్యక్రమాల్లో రసాబాస నెలకొంది. కనపర్తి గ్రామంలో ప్రతి పనికీ ఒక రేటుపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని గ్రామస్తులు రెవెన్యూ అధికారులపై విరుచుకుపడ్డారు. రైతుల పాసుపుస్తకాలు, చిన్నపిల్లల సర్టిఫికెట్‌కు సంబంధించి వంటి పలు సమస్యలకు తహశీల్దార్ డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. భూములు ఆన్‌లైన్ చేయకపోవడంతో బ్యాంకుల్లో రుణాలు పొందలేకపోతున్నామని అవేదన వ్యక్తం చేశారు. అమ్మనబ్రోలు గ్రామంలో జరిగిన జన్మభూమి - మాఊరి సభలో సంతనూతనపాడు నియోజకవర్గం బిఎన్ విజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. అర్హులైన వారందరికీ సంక్షేమపథకాలు అందేవిధంగా కృషి చేస్తామన్నారు. గ్రామల్లో ఏ సమస్యనైనా తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. అమ్మనబ్రోలు ఎస్‌సి హస్టల్‌లో బోరు వేసేందుకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుజాత, ఎండిఓ కవిత చౌదరి, ఎంపిపి వీరయ్య చౌదరి, ఎంఇఓ జి. శేషయ్య, సర్వేయర్ భాస్కరరావు, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.



మాజీ సర్పంచ్‌ను పరామర్శిస్తున్న ఎంఎల్ఎ

ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి-యద్దనపూడి

అనంతవరం గ్రామంలో షుగరు వ్యాధితో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకున్న మాజీ సర్పంచ్ పెడవల్లి కామేశ్వరరావు అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటున్న గ్రామ నాయకులు కె రమేష్‌బాబును ఎంఎల్ఎ పరామర్శించి ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్ఎతో పాటు మండల నాయకులు, గ్రామ నాయకులు ఉన్నారు.

రాయితీపై పశువుల దాణా

ప్రజాశక్తి-కారంచేడు

పశుపోషకులకు అవసరమైన కరువు దాణాను రాయితీపై అందిస్తున్నామని అర్హత కల్గిన పశుపోషకులు వీటిని వినియోగించుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ అరుణ అన్నారు. స్థానిక మండలంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిభిరంలో పశువులకు పరీక్షలు చేసి అవసరమైన వాటికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 400కేజీల దాణాను, కేజీ రూ.2ల చొప్పున అందిస్తున్నామన్నారు. గ్రామంలో మొత్తం 34 పశువులకు పరీక్షలు చేసి మందులు అందించారు. 30 దూడలకు, 260 గొర్రెలకు నట్టల నివారణ మాత్రలు పంపిణీ చేశారు.

12న దుద్దుకూరులో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఈ నెల 12వ తేది నుండి దుద్దుకూరులో పోలేరమ్మ గుడి దగ్గర జిల్లా స్థాయి వాలీభాల్ పోటీలు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆద్వర్యంలో నిర్వహిస్తునట్లు ఘట్టమనేని యూత్ ఫోర్స్ వారు తెలిపారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ఈనెల15 వరకు నిర్వహించే ఈ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులతోపాటు క్రీడాకారుని అవార్డులు కూడ ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గోనే జట్లు ప్రవేశ రుసుము రూ. 200 చెల్లించాలన్నారు. వివరాల కోసం చిగురుపాటి సుధీర్ 9951519519 లను సంప్రదించ వలసినదిగా కోరారు.



వృద్దులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

చీరాల రూరల్ : యెనుముల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం ప్రసాద్‌నగర్‌లోని ప్రార్ధనా మందిరంలో వృద్ధులకు సంఘ కాపరి వై శ్యామ్యుల్ చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు యెనుముల వెంకటబాబు మాట్లాడుతూ తమ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వృద్ధులకు అనేక రకాల వస్తువులను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బిసి ఫెడరేషన్ అధ్యక్షులు యెనుముల యానాదిరావు, వై వంశీగౌడ్, వై సూర్యప్రదీప్‌గౌడ్, ఎన్ సాంబశివరావు, సిహెచ్ వెంకయ్య, వై సూరిబాబు పాల్గొన్నారు.

పేద ప్రజల అభివృద్దే ధ్యేయం

శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి-యద్దనపూడి

పేద ప్రజల అభివృద్దే టిడిపి ధ్యేయమని స్థానిక శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని 14 పంచాయతీలు, 18గ్రామాలలో మంగళవారం జన్మభూమి మన ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతవరం గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మించిన సిమెంటు రోడ్డును, ప్రపంచ బ్యాంక్ నిధులతో నిర్మించిన ఒహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. చంద్రన్న భీమా కింద విద్యార్థులకు వచ్చినటువంటి ఉపకారవేతనాల ప్రొసీడింగ్‌ను విద్యార్థుల తల్లులకు పంపిణీ చేశారు. ఎన్‌టిఆర్ బరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఐసిడిఎస్ ద్వారా ఏర్పాటు చేసిన అన్నధాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జీ ఎండిఓ రాంబాబు, ఇన్‌ఛార్జి తహశీల్దారు శ్రీనివాసరావు, ఎంఇఓ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎఇలు కెవివి సుబ్రహ్మణ్యం, సురేష్, మండల వైద్యాధికారి లక్ష్మీపాపారావు, పశు వైద్యాధికారులు కరీముల్లా, సురేష్, వెలుగు సిబ్బంది సిసి కోటమ్మ, దేవాదాయశాఖ అధికారి రామారావు, పంచాయతీ కార్యదర్శి బాబూరావు, విఆర్ఓ సుభాని, పిఆర్ ఎఇ రామచంద్రరావు, ఆర్అండ్‌బి ఎఇ జన్మభూమి కమిటీ సభ్యులు సీతయ్య, మురళీ, రంగయ్య, గ్రామంలోని నాయకులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఒహెచ్ఎస్ఆర్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

గిరిజన స్థలాలు గిరిజనులకే ఇవ్వాలి

- గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాం శ్రీనివాసరావు



దర్నా చేస్తున్న గిరిజనలు

ప్రజాశక్తి-చిన్నగంజాం

మండలంలోని పలుకాలనీలలో గిరిజనులు నివసిస్తున్న స్థలాన్ని గిరిజనులకే ఇవ్వాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాం శ్రీనివాసరావు కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యలయంలో మంగళవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో గోసు శ్రీనివాస్ అధ్యక్షతన ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మీకాలనీ, కడవకుదురు యానాది సంఘం, కోటేశ్వరరావు కాలనీ, పోలేరమ్మకాలనీలకు సంబంధించిన గిరిజన, దళిత, మధ్య తరగతి ప్రజలు ఉన్నారు. వీరు 1992 నుండి వాగు పోరంబోకు భూమిలో చిన్న చిన్న గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. గిరిజన నివసిస్తున్న స్థలాన్ని స్థానిక తహశీల్దార్ పట్టాలిస్తామని నచ్చ చెప్పి ఆ స్థలాన్ని ఖాళీ చేయించారన్నారు. ఆ తరువాత వాటిని ఆయన బంధువులకు, అధికార పార్టీనాయకులకు కట్టపెట్టి ఆన్‌లైన్ చేసి, వారికి ఆ భూమిపై కోర్టు హక్కు కల్పించిదని చెప్పడం దుర్మార్గమని అన్నారు. పేదల భూములు పేదలకే దక్కేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అదే విధంగా సిపిఎం పర్చూరు నియోజకవర్గ కార్యదర్శి ప్రతాప్ సంఘీభావం తెలిపి పేదల పక్షాన తమ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వం దళిత, గిరిజన సంక్షేమం మా ధ్యేయం అని ప్రగల్భాలు పలుకుతూ, వారిని మోసం చేస్తుందని తెలిపారు. పేదల భూమి పేదలకే దక్కేలా చర్యలు తీసుకోవాలని సమస్య పరిష్కారం అయ్యేవరకు ప్రజల పక్షాన పోరాటం చేయటానికి వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో తిరువీదుల చిరంజీవి, అద్దూరి అంకమరావు, కొమ్ము దేవదానం,తదితరులు పాల్గొన్నారు.

వైద్యవిధాన బిల్లును వ్యతిరేకిస్తు నిరసన

ప్రజాశక్తి-చీరాల రూరల్

కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన నూతన వైద్యవిధాన బిల్లును వ్యతిరేకిస్తూ ఐఎంఎ ఆధ్వర్యంలో డాక్టర్లు అత్యవసర వైద్యం మినహా సాధారణ వైద్య పరీక్షలను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐఎంఎ హాలులో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ పోలవరపు వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడారు. పార్లమెంట్‌లో నూతనంగా ప్రవేశపెట్టిన బిల్లు వలన వైద్య వృత్తిలో ప్రమాణాలు పడిపోతాయని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు, ఐఎంఎ కార్యదర్శి డాక్టర్ జి పున్నారావు, డాక్టర్ వెంకట్రావు, డాక్టర్ ఐ బాబూరావు, డాక్టర రామకృష్ణహనుమాన్, డాక్టర్ గోరంట్ల రాజేష్ పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్

'జన్మభూమిలో సమస్యలు పరిష్కారం'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి-వేటపాలెం

క్షేత్ర స్థాయిలో ప్రజాసమస్యలను పరిష్కరించడానికి జన్మభూమి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంఎల్ఎ ఆమంచి కృష్ణమోహన్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జన్మభూమి కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండల కేంద్రమైన వేటపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని గోలీల తోటలో ఐదవ విడత జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రసంగించారు. గోలీల తోటను సుందరంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. మండలంలో 414 కొత్త రేషన్‌కార్డులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ఎంపిపి బండ్ల తిరుమలాదేవి, ఎంపిడిఓ కె నేతాజీ, తహశీల్దారు కెఎల్ లింగమహేశ్వరరావు, సర్పంచ్‌లు కర్పూరపు రమాదేవి, శ్రీధర్, ఎంపిటిసిలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

5న చలో విజయవాడ

ప్రజాశక్తి-చీరాల

రాష్ట్ర వ్యాప్త స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సెలెక్టడ్ ప్యానల్ సబ్ స్టాఫ్ ఎంప్లాయిస్ సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న అపరిష్కృత సమస్యలకు సత్వర పరిష్కారం కోరుతూ ఈనెల 5న రాష్ట్ర వ్యాప్తంగా రిలే నిరాహారదీక్షలు చేపట్టనున్నట్లు స్టేట్‌వైడ్ ఎస్‌బిఐ సెలెక్టడ్ ప్యానల్ సబ్‌స్టాఫ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పోలగంగు ఆనంద్ ఓ ప్రకనటలో తెలిపారు. గత 20 సంవత్సరాలుగా న్యాయాస్థానాలను ఆశ్రయించి న్యాయమూర్తులచే సానుకూల తీర్పులు వచ్చినా వాటిని అమలు పరచని యాజమాన్య నిర్లక్ష్యవైఖరిని తీవ్రంగా నిరసిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సిపిఎం, సిపిఐ, సిఐటియు, పలు ప్రజాసంఘాల నాయకుల మద్దతులో ఈ రిలే నిరాహారదీక్షలు ఈనెల 5న విజయవాడలోని అలంకార్ సెంటంర్‌లో ధర్నాచౌక్ వద్ద జరుగుతాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా బాధిత అభ్యర్థులు అందరుపాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ కార్యదర్శులు

నేడు, రేపు ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

చీరాల రూరల్ : ఎస్ఎఫ్ఐ ప్రకాశం జిల్లా 40వ మహాసభ నేడు, రేపు చీరాలలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ తెలిపారు. సిఐటియు కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో విద్యారంగం ఎదుర్కుంటున్న సమస్యలపై సభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లాకు ఒక విశ్వవిద్యాలయం ప్రకటించిన ప్రభుత్వం ప్రకాశం జిల్లాను విస్మరించి ందని ఆరోపించారు. జిల్లాకు మంజూరైన అబ్దుల్‌కలాం ఐఐఐటి పేరుకు ఒంగోలు అయినప్పటికీ నిర్వహణ, అడ్మిషన్లు మొత్తం ఇడుపులపాయలోనే నిర్వహిస్తున్నారని అన్నారు. సంక్షేమ వసతిగృహ విద్యార్థుల సమస్యలు వర్ణణానితం అన్నారు. వీటన్నింటి పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ఉద్యమిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి జి ఆదిత్య పాల్గొన్నారు.

నేడు టెట్, డిఎస్‌సిపై అవగాహన సదస్సు

చీరాల రూరల్ : స్థానిక ముంతావారి సెంటర్‌లోని విఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాంపిటేటివ్ సెంటర్‌లో బుధవారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు ప్రముఖ విద్యావేత్త డిఎస్సీ నిపుణులు మాజీ ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావుచే టెట్, డిఎస్సీపై అవగాహన సదస్సు నిర్వహిస్తామని విఎస్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఎన్ కోటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. కావున ఈ అవకాశాన్ని చీరాల పరిసర ప్రాంత డిఎస్‌సి అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.



విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

చీరాల : స్థానిక కస్తూరి గాంధీ బాలికోన్నత పాఠశాలలో వూర మస్తాన్‌రావు, శివరాజకుమారి ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు 200 నోట్ పుస్తకాలు అందచేశారు. ఇప్పటి వరకు 42 పాఠశాలల్లో 6వేలకు పైగా నోట్‌పుస్తకాలను పేద విద్యార్థులకు అందజేసినట్లు వూర మస్తాన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివి బాబు, ఎంజిసి కాలనీ అధ్యక్షులు చారుగుళ్ళ గురు ప్రసాద్, గీతా సంస్థ ప్రతినిధి పేరాల జనార్ధన్ పాల్గొన్నారు



ఎద్దుల బండి ఎక్కిన ముఖ్యమంత్రి చంద్రబాబు



ముగ్గును పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

సిఎం సభలో పండుగ వాతావరణం



రేషన్ కార్డు అందజేస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

- హరిదాసులు, గంగిరెద్దులతో 'సంక్రాంతి' సందడి
- ఉత్సాహంగా సాగిన ఐదో విడత జన్మభూమి
- విద్యార్థులతో కలిసి చిందేసిన చంద్రబాబు

ప్రజాశక్తి-దర్శి

ఐదో విడత జన్మభూమి కార్యక్రమం ప్రారంభం సందర్భంగా దర్శిలో ఏర్పాటుచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సభలో పండగ వాతావరణం నెలకొంది. ముగ్గులు, హరిదాసులు, గంగిరెద్దులతో సంక్రాంతి సందడి కనిపించింది. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సిఎం చంద్రబాబునాయుడు చిందేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐదో విడత జన్మభూమి కార్యక్రమం దర్శిలో ఉత్సాహంగా సాగింది. మధ్యాహ్నం ఒంటి గంటకు దర్శి పట్టణానికి సమీపంలోని శివరాజ్ నగర్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ రాష్ట్ర అటవీ పర్యావరణ మరియు శాస్త్ర సాంకేతిక మంత్రి శిద్దా రాఘవరావు, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, శాసనమండలి సభ్యులు బలరాం, ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు ఆయనకు ఎదురేగి, స్వాగతం పలికారు. అనంతరం 1.10కి ముగ్గులు, క్రీడల పోటీల ప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడ లింగంగుంటకు చెందిన ఎస్‌కె.బాబు ఎద్దుల బండిపై ఎక్కి చర్నాకోల్ తిప్పుతూ చంద్రబాబు బండిని తోలాడు. అనంతరం కోలాటాన్ని తిలకించారు. ఈ సందర్భంగా గంగిరెద్దుల వారు చంద్రబాబుకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పూర్తి గ్రామీణ వాతావరణం తలపించిన ప్రాంగణంలో హరిదాసులు సంక్రాంతి పాటలు పాడారు. అనంతరం చంద్రబాబు ముగ్గుల పోటీలు తిలకించారు. కస్తూరిభా పాఠశాల విద్యార్థులు వేసిన ముగ్గులు చూసి మంత్రముగ్ధులయ్యారు. అక్కడ విద్యార్థులతో కలిసి చిందేసి, వారితో సెల్ఫీలు దిగారు. అనంతరం బాలికల కబడ్డీ పోటీలను తిలకించారు. అనంతరం సభ ప్రాంగణంలో జిల్లా అభివృద్ధిపై 20 శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ట్రాక్టర్లు, ఇన్నోవా కార్లు, వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రూ.245 కోట్లతో చేపట్టనున్న వివిధ శాఖల పనులను ప్రారంభించారు. రెండు గంటలకు సభా వేదికకు చేరుకున్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి అక్కడ తెలుగు తల్లి గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన నృత్యాలు అలరించాయి. మంత్రి శిద్దా రాఘవరావు సతీమణి లక్ష్మీపద్మావతి, వారి కుమారుడు సుధీంకుమార్ చంద్రబాబును దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. టిడిపి మండల అధ్యక్షులు నారపుశెట్టి పిచ్చయ్య, పట్టణ అధ్యక్షులు దారం సుబ్బారావు ముఖ్యమంత్రిని గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి శిద్దా మాట్లాడుతూ దర్శి నియోజకవర్గంలో రూ.1750 కోట్లతో అభివృద్ధి జరిగిందని, ఇదంతా ముఖ్యమంత్రి చలవే అని కొనియాడారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ సూరే చినసుబ్బారావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి బి.రవి, సర్పంచ్ జిసి.గురవయ్య, ఎంపిపి పూసల సంజీవయ్య, ఎంపిటిసి ముత్తిరెడ్డి శిరీష, కలెక్టర్లు వినయ్‌చంద్‌తో పాటు, ఉదయలక్ష్మీ, రాబర్ట్, జెసి నాగలక్ష్మీ, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, కరణం వెంకటేష్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




విద్యార్థితో మాట్లాడుతున్న నారా చంద్రబాబునాయుడు

భారీగా జన సమీకరణ

సిఎం సభను రాష్ట్ర మంత్రి శిద్దా రాఘవరావు ప్రతిష్టాత్మకంగా తీసుకుని భారీగా జన సమీకరణ చేశారు. ప్రతి గ్రామం నుండి నాయకులు, కార్యకర్తలతో వాహనాలు పంపి జనాన్ని సమీకరించారు. నియోజకవర్గంలోని 94 పంచాయతీలలో ఆ గ్రామాల నాయకులకు శిద్దా రాఘవరావు భారీ ఎత్తున జన సమీకరణ చేయాలని ఆదేశించారు. పార్టీ మండల అధ్యక్షులు నారపుశెట్టి పిచ్చయ్య, చాగం కొండారెడ్డి, సోమపల్లి శ్రీనివాసరావు, కాట్రాజు నాగరాజు, మోండు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జన సమీకరణ చేశారు. వచ్చిన వారందరికీ 16 కౌంటర్లలో భోజన సౌకర్యం ఏర్పాటుచేశారు. పసుపు పచ్చ తోరణాలతో దర్శి మొత్తం కటౌట్‌లతో నిండిపోయింది. సభాస్థలి వద్ద భారీ కటౌట్‌లు వెలిశాయి. సభాస్థలి వద్ద మంత్రి శిద్దా రాఘవరావు, సుధీర్‌కుమార్, ముఖ్యమంత్రి బొమ్మలతో గాలి బుడగలు అలరించాయి. గడియార స్తంభం సెంటర్‌లో తెలుగు యువత మండల అధ్యక్షులు బాశం పిచ్చయ్య ఏర్పాటు చేసిన గాలి బుడగ, ఎంపిటిసి ముత్తిరెడ్డి శిరీష, సాంబయ్యలు ఆంజనేయ స్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన గాలి బుడగలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



తల దువ్వుకుంటున్న చంద్రబాబు



విద్యార్థినులతో సెల్ఫీ



చంద్రన్న పెళ్లికానుక సీడీని ఆవిష్కరిస్తున్న సిఎం

ప్రజాశక్తి
www.prajasakti.com
ప్రకాశం
బుధవారం 3 జనవరి 2018

త్యాగానికి మరో పేరు నరసింహారెడ్డి

ప్రజాశక్తి-పిసిపల్లి

ప్రస్తుతం రాజకీయాల్లోకి ఆస్తులు సంపాదించుకోవడానికి, అక్రమ సంపాదనను పెంచుకోవడానికే ఎక్కువమంది వస్తున్నారు. కానీ ప్రజల కోసం, ప్రజాఉద్యమాల కోసం ఆస్తులను అమ్మినవారెవరన్నా ఉన్నారంటే వారు కమ్యూనిస్టులే.. అలాంటి కమ్యూనిస్టులలో ముఖ్యులు డాక్టర్ చాగంరెడ్డి నరసింహారెడ్డి. ప్రజల కోసం, కమ్యూనిస్టు ఉద్యమాల కోసం ఆస్తులను అమ్ముకొని త్యాగానికి మారుపేరుగా నిలిచారు.

పిసిపల్లి మండలం నేరేడుపల్లికి చెందిన ముసలారెడ్డి, చెన్నమ్మకు రెండో సంతానంగా 1921 ఫిబ్రవరి 21న నరసింహారెడ్డి జన్మించారు. ఐదో తరగతి వరకు నేరుడుపల్లిలోనే చదివారు. 1935-38 వరకు నరసింహారెడ్డి, కామ్రేడ్ గుజ్జుల యలమందారెడ్డి, కాశింసాహెబ్‌తో సహా తొమ్మిది మంది రామాగోవిందాపురంలో ఎనిమిదో తరగతి వరకు చదివారు. అప్పట్లోనే వీరిలో స్వాతంత్ర పోరాట బీజాలు పడ్డాయి. 1938 నుంచి 1942 వరకు ఒంగోలులో విద్యనభ్యసించారు. ఐదో ఫారం చదివేటప్పుడు ఒంగోలులో బోర్డింగ్ స్టూడెంట్‌తో సమ్మె నిర్వహించారు. అనంతరం నరసింహారెడ్డి స్టూడెంట్ ఫెడరేషన్‌లో చేరాడు. ఆరో ఫారం చదివే సమయంలో కమ్యూనిస్టు పార్టీలో సభ్యుడిగా ఉన్నారు. కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించడంతో మధ్యలో చదువు మానేశారు. ఆ తరువాత నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం, జరకాశిపాలెంలో బైనకామయ వద్ద ఆయుర్వేద వైద్యం నేర్చుకున్నారు. అక్కడే సిరోమణి పరీక్షలు రాసి డాక్టర్ అయ్యారు. ఈ విధంగా జబ్బులు నయం చేసే డాక్టర్‌తో పాటు ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేసే సామాజిక వైద్యులయ్యారు. ముందడుగు, పోతుగడ్డ అనే నాటికల రూపంలో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. 1944లో తిరిగి నేరేడుపల్లికి చేరారు. 1947లో చెన్నమ్మను వివాహం చేసుకున్నారు. 1949 వరకు గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి పూనాదులు వేశారు. బుజ్జుల యలమందారెడ్డి, సుకమంచి వెంకటస్వామి, కాశింసాహెబుతో కలిసి వీరు నేరేడుపల్లిలో కమ్యూనిస్టుపార్టీని ఏర్పాటుచేశారు. 1949 నుంచి పూర్తికాలం కార్యకర్తగా పనిచేస్తూ 1950 వరకు గ్రామంలోనే కష్టజీవుల చెంతనే వారికి అండగా ఉన్నారు. పోలీసు ఇన్‌ఫార్మర్‌గా ఉన్న పోతవరం మునుసుబు హత్య అనంతరం 1951 వరకు నల్లమల్ల అడవిలో రహస్య జీవితం గడిపారు. 1952లో కనిగిరి తాలూకా కార్యదర్శిగా, నెల్లూరు జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉన్న సమయంలో పార్టీని బతికించాలనే ఉద్దేశంలో పార్టీ కోసం చేసిన అప్పుల నిమిత్తం తన స్వంత భూమిని అమ్మేశారు. 1953లో నెల్లూరు జిల్లా నందికొండ ప్రాజెక్టు మహాసభ జరిగింది. ఆ మహాసభ జయప్రదం కోసం నరసింహారెడ్డి చేసిన కృషి అమోఘమైంది. పెత్తందారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు. ఓ సమయంలో రైతు రాయాబారానికి కర్నూలు వెళుతున్న కమ్యూనిస్టులను కంభం రైల్వే అధికారులు అడ్డుకున్నారు.

- కనిగిరి కమ్యూనిస్టు ఉద్యమాల్లో ముఖ్యులు
- ప్రజల నాడి తెలిసిన వైద్యులు చాగంరెడ్డి
- ప్రజాఉద్యమాల కోసం ఆస్తుల అమ్మకం

ఆదర్శ నేత బాట

వారి తీరుకు వ్యతిరేకంగా నరసింహారెడ్డి నాయకత్వంలో పది గంటల పాటు అందోళన చేశారు. రైల్వే అధికారులు కేసు నమోదు చేయటంలో నరసింహారెడ్డికి ఐదు నెలలు శిక్ష పడగా రాజమండ్రి జైల్లో శిక్ష అనుభవించారు. 1954-58లో విజయవాడలో, 1960లో కనిగిరిలో కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన రాజకీయ పాఠశాలలో పాల్గొన్నారు. 1960లో ఉత్తర నెల్లూరు జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘాన్ని నిర్మించి ఆ సంఘానికి జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 1955-64 భారీ మెజార్టీతో నేరడుపల్లి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. తిరిగి 1963 జులై 10న కనిగిరి తాలుకా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1964 మేలో ఉత్తర నెల్లూరు జిల్లా ముఖ్యుల సమావేశం కనిగిరిలో జరిగింది. సమావేశానికి పుచ్చలపల్లి సుందరయ్య హాజరయ్యారు. నూతన జిల్లా కమ్యూనిస్టు పార్టీ ఆర్గనైజింగ్ కమ్యూనిస్టుగా ఎన్నికయ్యారు. అదే సంవత్సరం సెప్టెంబర్ 4, 5 తేదీలలో మండల కేంద్రమైన పిసిపల్లిలో ఉత్తర నెల్లూరు జిల్లా మహాసభ జరిగింది ఈ మహాసభను జయప్రదం చేయటంలో సూరా పాపిరెడ్డితో పాటు నరసింహారెడ్డి కృషి ఉంది. ఈ మహాసభలకు మోటూరి హనుమంతరావు ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సభలలో నరసింహారెడ్డి జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అదే సంవత్సరం డిసెంబర్ 29న దేశరక్షణ చట్టం కింద నరసింహారెడ్డితో పాటు సూరా పాపిరెడ్డిని, మరికొందరిని అరెస్టు చేశారు. 1966లో తిరిగి విడుదల చేశారు. 1968 జూన్‌లో మార్క్సిస్టు పార్టీలో వచ్చిన సిద్ధాంత విభేదాల వల్ల కనిగిరి తాలుఆ మార్క్సిస్టు పార్టీ ఉద్యమ నాయకులు నక్సలిజం వైపు మొగ్గు చూపి.. అడవిలోకి వెళ్లారు. నరసింహారెడ్డి 1969లో నక్సలైట్ పార్టీకి రాజీనామా చేసి, వచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం 1969 జులై 27న నరసింహారెడ్డిని అరెస్టు చేసి 1970 మార్చిలో విడుదల చేసింది. ఈవిధంగా కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా నరసింహారెడ్డి అనేక సార్లు జైలు జీవితం గడిపారు. కమ్యూనిస్టు పార్టీని నిర్మించేందుకు, పార్టీ సభ్యులను తయారుచేసేందుకు నరసింహారెడ్డి క్రియాశీలకంగా పనిచేశారు. నరసింహారెడ్డి తయారుచేసిన సభ్యులు కనిగిరిలో చాలామంది ఉన్నారు. సభ్యులకు సైద్ధాంతిక అవగాహన కోసం సిద్ధాంతాలు అందరికీ అర్ధమయ్యే సులభమైన భాషలో తయారుచేసేవారు. పార్టీ చీలిక సమయానికి సూరా పాపిరెడ్డితో కలిపి నరసింహారెడ్డి అన్ని గ్రామ శాఖలకూ వెళ్లి సిద్ధాంతాలపై అవగాహన కల్పించేవారు. పార్టీ చీలిక తరువాత నరసింహారెడ్డి, పాపిరెడ్డి, వెంకోబరావు, మూలే వెంకటస్వామిరెడ్డి, బాలు ఓబుల్‌రెడ్డి, కె.ఓబుల్‌రెడ్డి, ఎం.వెంకటస్వామి, నబీసాహెబ్, సానికొమ్ము పోలురెడ్డి, ఎం.వి.స్వామి, అమడసాని పుల్లారెడ్డి, దమ్ము జయరావు, ఇరిగినేని తిరుపతినాయుడు వీళ్లంతా కనిగిరి తాలుకా సిపిఎం కమిటీగా ఉన్నారు. నరసింహారెడ్డి 1970లో జైలు నుంచి విడుదలైన తరువాత 1973 వరకు కనిగిరిలోనే నివాసం ఉన్నారు. పార్టీలో పని చేసే సమయంలో చేసిన అప్పుల కోసం తన ఇంటిని అమ్మేశారు. కనిగిరిలో సిపిఎం నిర్మాణంలో లేకపోవటం, నక్సలైట్ల పార్టీని నిషేధించడంతో 1973 వరకు కమ్యూనిస్టు అభిమానిగానే కనిగిరిలో ఉన్నారు. అనంతరం చిలకలూరిపేటకు జీవనోపాధి కోసం వెళ్లారు. ఆయన భార్య చెన్నమ్మ క్యాన్సర్ వ్యాధితో మృతిచెందింది. నరసింహారెడ్డి జైలు జీవితం గడిపే సమయంలో చెన్నమ్మ కుటుంబాన్ని పోషించేందుకు ఎన్ని ఇబ్బందులు పడినా భర్త కమ్యూనిస్టు పార్టీలోనే పనిచేసేందుకు ప్రోత్సహించేది. భార్య మృతి అనంతరం నరసింహారెడ్డి విజయవాడ వెళ్లారు. ఎక్కడ ఉన్నా ప్రతి సంవత్సరం కనిగిరి, నేరేడుపల్లి, పిసిపల్లి, బుడ్డారెడ్డిపల్లికి వచ్చి కమ్యూనిస్టు సిద్ధాంతాలను వివరించేవారు. 2002 జూన్ 6న తెనాలిలో గుండెపోటుతో మృతిచెందారు.





నరసింహారెడ్డి (ఫైల్)

గిరిపుత్రుల పథకాలు..అభివృద్ధికి బాటలు

- అవగాహన లేక దరఖాస్తు చేసుకోని గిరిజనులు - వెనక్కు వెళుతున్న నిధులు

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు, వారికి జీవనోపాధి కల్పించేందుకు అనేక పథకాలను రూపొందించింది. ఈ పథకాలపై అవగాహన కల్పించటంలో అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. గిరిజనులలో ఎక్కువమందికి చదువుకొనే అవకాశం ఉండదు. అందువల్లవ వారికి పథకాల గురించి తెలియదు. ఇలాంటి అవగాహన కల్పించటానికి అధికారులు ఎక్కువ శ్రద్ధ వహించాలి. కానీ అధికారులు అలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గిరిజనులకు అవగాహన తక్కువగా ఉండటంతో దళారులదే ఇష్టారాజ్యమైంది. గిరిజనులకు పథకాలు సక్రమంగా అందడం లేదని గిరిజన సంఘాలు అనేక సార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదనే విమర్శలున్నాయి.

ఎస్‌టి కార్పొరేషన్, ఐటిడిఎ ద్వారా గిరిజనులకు సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేస్తున్నారు. గత ఏడాది ఈ పథకాలకు ప్రభుత్వం ఇచ్చిన నిధులను కూడా లబ్ధిదారులు లేరనే సాకుతో తిరిగి వెనక్కి పంపారు. జిల్లాలో 1.8 లక్షల మంది గిరిజనులు ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. జిల్లాకు ఈ ఏడాది ఎస్‌టి కార్పొరేషన్ ద్వారా ఒబియమ్‌యమ్‌యస్ స్కీం కింద 541 యూనిట్లు, పందుల పెంపకందారులకు ప్రత్యామ్నాయంగా 150 యూనిట్లు మంజూరు చేశారు. బ్యాంకుల నుండి ఇబ్బందులు ఎదురవుతుండటంతో నేరుగా గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రుణాలు అందజేయాలని జిల్లాకు 75 యూనిట్లు మంజూరు చేశారు.

ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు

ఒ.బి.యం.యం.యస్. పథకం ద్వారా రుణం పొందేందుకు గిరిజనులు ముందుగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ పథకం కింద గిరిజనులకు గొర్రెల పెంపకం, పాడిగేదెలు, విద్యుద్దీకరణ, సబ్‌మెర్శిబుల్ పంపుసెట్లు, బుట్టల తయారీ, టెంట్ హౌస్, సెంట్రింగ్ మెటీరియల్, కాంక్రీట్ మిక్స్‌డ్ విత్ వైబ్రేటర్, కంప్యూటర్, ఇంటర్‌నెట్, మీ సేవా సెంటర్లు, పాలప్యాకెట్లు, వార్తాపత్రికల వ్యాపారం, ఆటో, డిటిపి, జిరాక్స్, స్క్రీన్ ప్రింటింగ్, మినీ ఫ్లోర్‌మిల్, టైలరింగ్, కూరగాయలు, పండ్ల అమ్మకం, సైబర్‌బోట్, చేపల అమ్మకాల వంటి వ్యాపారాలు ఈ పథకం కిందకు వస్తాయి.

Andhra Pradesh State Online Beneficiary Management and Monitoring System (OBMMS)

ఎన్ఎస్ఎఫ్‌డిసి పథకం

ఈ పథకం నూతనంగా ప్రారంభించబడింది. ఈ పథకంలో బ్యాంకు లింకేజి లేకుండా నేరుగా కార్పొరేషన్ ద్వారా రుణం తీసుకోవచ్చు. బ్యాంకర్లతో లబ్ధిదారులకు వస్తున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నేరుగా గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకానికి కూడా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఇందులో రూ.15 లక్షల వరకు రుణం అందజేస్తారు. ఇందులో 35 శాతం వరకు సబ్సిడీ ఇస్తారు. ఇటీవల జిల్లాకు ఐదు ఇన్నోవా కార్లు ఇచ్చారు. ఈ పథకంలో కూడా టెంట్‌హౌస్, ఆటో, కార్లు, పాల ఉత్పత్తి కేంద్రాలు, ట్రాక్టర్, జిరాక్స్, పాడిగేదెలు ఇస్తారు. ఈ పథకానికి లబ్ధిదారులను మండల స్థాయిలో ఎంపిడిఒ ఆధ్వర్యంలో ఎంపిక చేస్తారు. లబ్ధిదారులు బ్యాంకుకు వెళ్లే అవసరం లేకుండా నేరుగా కార్పొరేషన్ ద్వారా రుణం అందజేస్తారు. లబ్ధిదారుల ఎంపిక తరువాత నేరుగా కార్పొరేషన్ ద్వారా గ్రౌండింగ్ చేస్తారు.

ప్రత్యామ్నాయ ఉపాధి..

పందుల పెంపకందారులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేందుకు 150 యూనిట్లు మంజూరు చేశారు. ఈ పథకాన్ని ప్రత్యేకంగా ఎరుకల వారి కోసం ప్రవేశపెట్టారు. ఈ పథకంలో బుట్టల అల్లకం, టెంట్‌హౌస్, గ్రైండర్లు, కూరగాయలు, పండ్ల అమ్మకాలు, పాడిగేదెలు, ఆటో, గొర్రెల పెంపకం... పురపాలక సంఘం పరిధిలో అమలు చేయబడతాయి. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి గ్రామసభ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఇందులో బ్యాంకులతో అంగీకారపత్రం తీసుకున్న వారికి ప్రాధాన్యతనిస్తారు.



అందని ద్రాక్షలా..

శ్రీరామ శ్రీనివాసరావు,
గిరిజన సంఘం జాతీయ కమిటీ సభ్యుడు (ఎఎఆర్ఎం)



అర్హులైన గిరిజనులకు సంక్షేమ పథకాలు అందని ద్రాక్షలా ఉన్నాయి. జన్మభూమి కమిటీల పేరుతో పథకాలు గిరిపుత్రులకు అందడం లేదు, 2013-14 లో వెయ్యి యూనిట్లు ఉండగా 2017-18 నాటికి 450 యూనిట్లకు దిగజారింది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే జిల్లాలో 1.8 లక్షల మంది గిరిజనులుం డగా 13 మండలాలలో గిరిజనులు లేరని అధికారులు చెబుతుండటం గమనార్హం. జిల్లాలో అధికారులు సంక్షేమ పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించాలి.

అవగాహన కల్పించడంలో విఫలం

ముడావత్ విష్ణునాయక్,
ఆదివాసి సంఘం (జెడబ్యుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ వాటిని గిరిజనులలోకి తీసుకెళ్లే విషయంలో అధికారులు విఫలమవుతున్నారు. ఎస్‌టి కార్పొరేషన్‌లో రుణాల మంజూరులో అవినీతి జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపించాలి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా గిరిజనులకు అన్యాయం జరుగుతోంది.

దళారులను ఆశ్రయించొద్దు..

కె.రాజ్యలక్ష్మి,
జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి



ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గిరిజనులకు అవగాహన కలిగించేందుకు బ్రోచర్లు ముద్రించాం. గిరిజనులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా కార్యాలయానికి వచ్చి వివరాలు తెలుసుకోవచ్చు. ఎటువంటి సమస్యలున్నా పరిష్కారానికి నేరుగా కార్యాలయంలో నన్ను సంప్రదించొచ్చు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పథకాలను అమలు చేస్తున్నాం..

'జన్మభూమి- మా ఊరు'కు సమస్యల ఏకరువు

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి వినతి

ప్రజాశక్తి-కందుకూరు

పట్టణంలో పేదల ఇళ్ళ స్థలాల సమస్య పరిష్కరించాలని మంగళవారం జరిగిన 'జన్మభూమి- మా ఊరు' కార్యక్రమంలో సిపిఎం . డిమాండ్ చేసింది. కందుకూరు పట్టణంలోని 2, 3 వార్డుల్లో సిపిఎం నాయకులు ఎస్‌కె.మున్వర్ సుల్తానా, ఎస్‌కె.మల్లిక, ఎం.మనోజ, టి.వెంకట్రావు జన్మభూమి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రెండవ వార్డులో మురుగుకాలువలు నిర్మించాలని కోరారు. కమ్యూనిటీ హాలు నిర్మించమని కోరుతూ అర్జీ ఇచ్చారు. 3వ వార్డు కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి ఎస్ఎ.గౌస్ మాట్లాడుతూ గతంలో పట్టాలు ఇచ్చిన వారికి స్థలాలు చూపించాలని కోరారు. ఉప్పుచెరువులో నివాసం ఉంటున్నవారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. అధికారులు మాట్లాడుతూ అందరికీ జి+3కి ఇళ్ళు ఇస్తామని చెప్పారు. అవసరమైన వారు అర్జీలు పెట్టాలని కోరారు. జి+3 ఇళ్ళు తీసుకోవడానికీ నిరుపేదలైన గిరిజనులు, డిపాజిట్‌లు కట్టలేకపోతున్నారని చెప్పారు. ఉప్పుచెరువులో నివాసం ఉంటున్న వారి సమస్యలు పరిష్కారంచేయాలని కోరారు. 20వ తేదిలోపు ఈ సమస్యలపై స్పష్టత ఇస్తామని అధికారులు చెప్పారు.



అర్జీదారులు లేక ఖాళీగా కూర్చున్న అధికారులు

వెలవెలబోయిన జన్మభూమి సభలు

ప్రజాశక్తి-గుడ్లూరు

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మికంగా ఏర్పాటు చేసిన జన్మభూమి- మా ఊరు సభలు వెలవెలబోయాయి. మండలంలోని కొత్తపేట, గుళ్ళపాలెంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన 5వ విడత జన్మభూమి- మా ఊరు గ్రామ సభలకు అన్ని శాఖల అధికారులు హాజరైనా, ప్రజలు ఎవరూ రాకపోవడంతో ఖాళీ కుర్చీలు కనిపించాయి. దీంతో ఏమి చేయాలో తెలియక అధికారులు మల్లగుల్లాలు పడ్డారు. గంటల తరబడి నిరీక్షించాక కొత్తపేటలో నాలుగు అర్జీలు, గుళ్ళపాలెంలో కేవలం రెండు అర్జీలు మాత్రమే రేషన్ కార్డుల కోసం వచ్చాయి. జన్మభూమి- మా ఊరు సభలకు ప్రజలు తరలిరావాలని ఎంత ప్రచారం చేసిన స్థానికులు హాజరు కాకపోవడంతో అధికారులు సాయంత్రం నాలుగు గంటల తరువాత తిరుగుమొఖం పట్టారు.

సమస్యల పరిష్కారానికే జన్మభూమి సభలు

గ్రామీణ ప్రాంతాల్లో పేరుకుపోయిన సమస్యలు తక్షిణం పరిష్కారం చేయడానికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మికంగా జన్మభూమి- మా ఊరు గ్రామ సభలు ఏర్పాటు చేశారు. నోడల్ ఆఫీసర్ నాగభూషణ శర్మ అన్నారు. మండలంలోని కొత్తపేట, గుళ్ళపాలెంలో ఎంపిడిఓ శ్రీనివాసులు, తహశీల్దార్ ఇందిరాదేవి అధ్యక్షతన జన్మభూమి సభలు నిర్వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. నోడల్ అధికారి మాట్లాడుతూ ప్రజలు సమస్యలు తెలియజేసి సద్వినియోగం చేసుకోవాలన్నారు. చంద్రన్న భీమా పథకం బాదితురాలికి రూ.30వేలు కొత్తపేటలో 44 మంది, గుళ్ళపాలెంలో 42 మంది విద్యార్థులకు రూ.50400లు స్కాలర్‌షిప్ చెక్కులు అందజేశారు. గుళ్ళపాలెంలో 20 మంది రైతులకు మూడవ విడత రుణమాఫీ చెక్కులు అందజేశారు.ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిఎం కృష్ణారావు, ఎంఇఓ సి.కల్లయ్య, ఇఒఆర్‌డి ఎం.వెంకటేశ్వర్లు, ఎంపిపి ఇల్ల శ్రీనివాసులు, ఎపిఓ వాఖ్యావతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ రమేష్, పశువైద్యం డాక్టర్ శ్రీకాంత్, వైద్య ఆరోగ్య శాఖ డాక్టర్ సందీప్, బిసి హాస్టల్ వార్డెన్ పి.రమణయ్య, ఆర్ఐ లక్ష్మీప్రసన్న, సర్పంచ్‌లు బొబ్బూరి నాగేశ్వరరావు, పచ్చిపాల మొగిలియ్య, జిల్లా బిసిసెల్ నాయకులు చిత్తారి మల్లికార్జున పాల్గొన్నారు.

- రేషన్ కార్డుల కోసం ప్రజల బారులు

- సభలకు హాజరైన అధికారులు

ప్రజాశక్తి-కొండపి

ప్రజా సంక్షేమ పథకాలతో ప్రజలను ప్రభుత్వం ముందుకు తీసుకుపోతుందని ఎంపిపి దేపూరి రత్తమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని కె.ఉప్పలపాడు, చినవెంకన్నపాలెం గ్రామాల్లో నిర్వహించిన జన్మభూమి- మావూరు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత ప్రభుత్వాలతో పోల్చుకుంటే టిడిపి అధికారంలోనికి వచ్చిన తర్వాతనే సంక్షేమ పథకాలు మెరుగ్గా అమలు జరుగుతుందన్నారు. గ్రామంలో వివిధ సమస్యలపై కె.ఉప్పలపాడులో 74, చినవెంకన్నపాలెంలో 30 అర్జీలు అందాయి. కార్యక్రమంలో ఎంపిడివో ఎ.ప్రభాకర్, ఎంఇఓ కె.సురేఖ, డిటి శర్మ, వివిధ శాఖల అదికారులు , సర్పంచ్ కోటేశ్వరమ్మ , పి. ఉషారాణి నాయకులు గుండపనేని రామూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏడు సంవత్సరాలుగా రేషన్‌కార్డులు లేవు

ఏడు సంవత్సరాలుగా రేషన్ కార్డుల కొరకు ధరఖాస్తు చేసుకున్న అందలేదని కె.ఉప్పలపాడు గ్రామానికి చెందిన మందా విజయలక్ష్మీ, దావులూరి కోటయ్య, కావూరి వినోద్ చౌదరి అధికారులకు తెలిపారు. ఏళ్ల తరబడి కార్యాలయాలు చుట్టు తిరుగుతున్నా అధికారులు కనికరం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మరల వారి సమస్యను అధికారులు ముందుకు తీసుకు వచ్చి తగు న్యాయం చేయాలని కోరారు.

హనుమంతునిపాడు : మండలంలోని హాజీపురం కిష్టంపల్లి గ్రామ పంచాయితీలలో సర్పంచుల అద్యక్షతన మంగళవారం నిర్వహించిన జన్మభూమి- మా ఊరుకు గ్రామ సభలలో 64 అర్జీలు అందాయని ఎంపిడిఒ కెయస్ మల్లిఖార్జునరావు తెలిపారు. రేషన్ కార్డులకోసం 22 పక్కాగృహాల మంజూరు కోసం 28 పించన్లకోసం 3 తాగు నీటి సరఫరా తదితర సమస్యలు పరిస్కరించాలని కోరుతూ 11 అర్జీలు అందాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి గ్రామసభలో ప్రజలకు ఆయా శాఖల అధికారులు వివరించారు. ఈ సందర్భంగా చంద్రన్న సంక్రాంతి కానుకలు రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి గాయం బలరామిరెడ్డి సర్పంచులు గాయం సుధాకర్ రెడ్డి సిహెచ్ మాలకొండమ్మ ఎంఆర్ఓ జి సావిత్రిదేవి మండల అన్నీ శాఖల అధికారులు జన్మభూమి కమిటి సభ్యులు దేవిరెడ్డి రఘునాదకాశిరెడ్డి మురహరి నరసయ్య గాయం తిరుపతిరెడ్డి గాయం రామిరెడ్డి గాయం సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



టంగుటూరులో రేషన్‌కార్డును అందజేస్తున్న అధికారులు

టంగుటూరు : ప్రజాసంక్షేమమే టిడిపి ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపిపి చదలవాడ సోమశేఖర్ అన్నారు. మండలంలోని ఆళ్ళకూరపాడు, అనంతవరం గ్రామాల్లో మంగళవారం ఎంపిడిఓ సి హనుమంతరావు అధ్యక్షతన ఐదవ విడత జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం అర్హులకు రేషన్ కార్డులు, ఎన్‌టిఆర్ భరోసా పథకం ద్వారా వృద్ధాప్య పింఛన్లు, సంక్రాంతికి చంద్రన్న కానుకలను ఎంపిపి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి పి కోటేశ్వరమ్మ, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కామన విజయకుమార్, బి వెంకటేశ్వర్లు, తహశీల్దారు రాజ్యలక్ష్మీరెడ్డి, ఉప్పలపాటి వెంకటేశ్వర్లు, ఎంపిటిసి వేణు, ఎండిఓ చెంచుపున్నయ్య, ఎపిఒ రాఘవ, ఎపిఎం రాజారావు, టిడిపి గ్రామ నాయకులు నార్నె మోహన్, హెచ్‌ఎం కె నాగలక్ష్మీ, ఇఓ సుబ్బరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శింగరాయకొండ : స్థానిక ప్రభుత్వజూనియర్ కళాశాలలో మంగళవారం నాడు ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్‌లో భాగంగా 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమంలో భాగంగా కళాశాల సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కళాశాలలో విద్యాభ్యాసం చేసిన వారు కళాశాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని ప్రిన్సిపల్ ఎల్.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఇక్కడ చదువుకున్న పూర్వ విద్యార్థులతో మాట్లాడి కళాశాలను అభివృద్ధికి సహకరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.గోపిచంద్ ప్రకాష్; చక్రపాణి, నరహరి తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు: స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి సిహెచ్.రాజచంద్రశేఖర్ అధ్యక్షతన మంగళవారం నాడు జన్మభూమి కార్యక్రమం సర్పంచ్ గురజాల ప్రసాదరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పోటు కోటిలంగం, జెడ్పిటిసి కోఆప్షన్ సభ్యులు ఎస్‌కె.బాజీ, ఎంపిటిసి సందానిబాషా, గ్రామ విఆర్‌ఓలు హస్సేన్‌బాషా, వీరాంజనేయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



జన్మభూమి సభలో మాట్లాడుతున్న అధికారులు

శింగరాయకొండ : పాకల గ్రామంలో మంగళవారం నాడు 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమం మొదలుపెట్టారు. సర్పంచ్ వాయిల తిరుపతమ్మ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. సంక్షేమం, సంతృప్తి అనే అంశంపై ఎంపిడిఒ ఎస్‌కె.జమీవుల్లా సమీక్ష నిర్వహించి అన్ని శాఖలఅధికారులతో మాట్లాడించారు. ఆరోగ్య సిబ్బంది మెడికల్ క్యాంప్ నిర్వహించారు.అంగన్‌వాడీ సిబ్బంది ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ బి.శివన్నారాయణ, పిఆర్‌ఎఇ కోటా శ్రీహరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ ఎం.నవకిషోర్, ఇరిగేషన్ ఎఇ ఎం.విజయలక్ష్మీ, వ్యవసాయ శాఖ అధికారి కెవి.శేషారెడ్డి, హౌసింగ్ ఎఇ నాగరాజు, ఎపిఓ ప్రతీప్‌కుమార్ ఎంపిఎం భాగ్యలక్ష్మీ, ఇఓఆర్‌డి ఎల్.బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శి బెల్లంకొండ ప్రసాదరావు హాజరయారు. అయితే కార్యక్రమానికి ఎంపిపి వై.శోభారాణి, జెడ్‌పిటిసి పొనుగోటి ఎస్తేరమ్మలు హాజరుకాకపోవడం గమనార్హం.



హనుమంతునిపాడులో చంద్రన్న కిట్‌లు అందజేస్తున్న నాయకులు

త్యాగాల పురిటిగడ్డ పిసిపల్లి

ప్రజాశక్తి - పిసిపల్లి



మాట్లాడుతున్న సిపిఐ కార్యదర్శి కె. అరుణ

త్యాగాల పురిటిగడ్డ పిసిపల్లి అని సిపిఐ జిల్లా కార్యదర్శి కె. అరుణ అన్నారు. మంగళవారం పిస ి పల్లి మండల మూడవ మహాసభ జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలను అమలు చేయడం లేదన్నారు. మూడేళ్ల కాలంలో ప్రజలపై భారాలు మోపారన్నారు. కార్పొరేటర్లకు దోచి పెట్టారని విమర్శించారు. సీనియర్ నాయకుడు ఎంఎల్ నారాయణ, కనిగిరి ప్రాంతీయ కార్యదర్శి వైరవింద్ర, కనిగిరి కార్యదర్శి యాసీన్, జిపి రామారావు, ఎస్‌కె బారాయమం, పి. మోహన్ పాల్గొన్నారు. అనంతరం మండల నూతన కార్యదర్శిగా పల్ల మాలకొండయ్య, సహాయ కార్య దర్శులు బండి తిరు పాలులతో సహా 11మంది ఎన్ను కున్నారు. బస్టాండ్ కూడలిలో సిపిఐ జెండాను కె.అరుణమ్మ ఆవిష్కరించారు.

ఆర్‌ఎస్‌ఎస్ దాడి గర్హనీయం

ప్రజాశక్తి-కందుకూరు



నిరసన తెలుపుతున్న బిటిఎ నాయకులు

పూణే పరిసర ప్రాంతాలలో భీమ్‌కోరేగావ్ విజయోత్సవ ర్యాలీపై ఆర్‌ఎస్ఎస్, హిందు మతోన్మాదుల దాడులు చేయడం జైభీమ్ సేన్ మంగళవారం ఒక ప్రకటనలో ఖండించింది. ఈ దాడులకు వ్యతిరేకంగా మంగళవారం కందుకూరు అంబేద్కర్ బొమ్మ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌ఎస్ఎస్ మతోన్మాదులు రెచ్చిపోతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిటిఎ నాయకులు కె.రామ్మోహన్‌రావు మాట్లాడారు. వేలాది సంవత్సరాలుగా మనువాద సంస్కృతిని కాపాడుతూ నేడు వారే ఈ దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఆత్మగౌరవంతో జీవించాలన్న దళిత బహుజనులు మరింత చైతన్యంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో అంబటి కొండలరావు, మాజీ కౌన్సిలర్ గేరా మనోహర్, గాండ్ల హరిప్రసాద్, ధమ్మాల నాగేశ్వరరావు, పి.బాలయ్య, కొండలరావు, మనోజ్, బిటిఎ నాయకులు వీరనారాయణ, కేశవులు, అబ్దుల్లా పాల్గొన్నారు.

ప్రజాశక్తి
అద్దంకి 11
బుధవారం 3 జనవరి 2018

జన్మభూమి - మా ఊరు ప్రారంభం

- మరుగుదొడ్డి బిల్లులు ఇవ్వాలని కొప్పెరపాడు వాసుల గగ్గోలు
- పలు చోట్ల పింఛన్లు, రేషన్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-అద్దంకి రూరల్

ప్రజా సమస్యల పరిష్కారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ధర్మవరం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జన్మభూమి - మాఊరు కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. గ్రామంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించి ఎమ్మెల్యే మాట్లాడుతూ 14 ఆర్థిక సంఘం నిధులు పంచాయతీకి వచ్చాయని, వీటిని డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి ఉపయోగించాని అధికారులకు తెలిపారు. పారిశుధ్య పనులు చేయాలని ఆదేశించారు. అనంతరం 51 రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 116 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ రూ.1,039,200 పంపిణీ చేశారు. 12 డ్వాక్రా గ్రూపులకు రూ.62 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి వి.ఆంజనేయులు, ఎంపిపి కరి అరుణ, ఎంపిడిఒ హేమాద్రినాయుడు, మండల ప్రత్యేక అధికారి ఇఇ శ్రీనివాసులు, జయచంద్రరావు, గ్రామ సర్పంచి నాగమ్మ, ఎపిఎం వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ సాయిశేఖరరెడ్డి, ఎఒ రమేష్, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, ఆరోగ్య మిత్రలు పాల్గొన్నారు.

శింగరకొండపాలెంలో : తహశీల్దార్ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో శింగరకొండలో జన్మభూమి-మాఊరు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ బ్రహ్మయ్య మాట్లాడారు. 26 అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు. రేషన్ కార్డులకు 11, ఇళ్ల స్థలాల కోసం 12, పాస్‌బుక్, ఇళ్ల నిర్మాణానికి ఒక్కొక్క అర్జీలు వచ్చాయన్నారు. అనంతరం 19 మందికి తెల్లరేషన్ కార్డులు పంపిణీ చేశామన్నారు. 15 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ నూనె విజయ్‌కుమార్, గ్రామ సర్పంచి సురభి కోటయ్య, ఎంఆర్‌ఐ కృష్ణమూర్తి, ఎఒ వెంకటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అద్దంకి : ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి జన్మభూమి-మాఊరు కార్యక్రమం మంచి వేదిక అని నగరపంచాయతీ చైర్‌పర్సన్ పి.దయామణి అన్నారు. పట్టణంలోని కొత్తదామావారిపాలెం రామాలయం దగ్గర ఉన్న కాకానిపాలెం ఎంపిపి స్కూల్ వద్ద జన్మభూమి -మాఊరు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలు వారి వారి సమస్యలు గురించి లిఖిత పూర్వకంగా అర్జీలు సమర్పించారు. తెల్లరేషన్ కార్డులు, వృద్ధాప్య పింఛన్లు మంజూరైన వారి పేర్లు చదివి వినిపించారు. కార్యక్రమంలో సాంబశివరావు, సిహెచ్ వెంకటేశ్వరరెడ్డి, 2వ వార్డు కౌన్సిలర్ కాకాని అమృతలక్ష్మి, ఎఇ శ్రీరామ్మూర్తి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, హెల్త్ ఎడ్యుకేటర్ కెఎ రాజు అధికారులు పాల్గొన్నారు.



ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

సంతమాగులూరు : మండలంలోని పత్తేపురం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగ ళవారం జన్మభూమి - మాఊరు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామంలో పశువైద్య, ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆరోగ్య శిబిరంలో 106 మంది రక్త పరీక్షలు చేయించుకున్నారు. వెలుగు ద్వారా 10 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి సన్నెబోయిన ఏడుకొండలు, ఎంపిడిఒ శ్రీనివాసకుమార్, ఇఒఆర్‌డి శ్యాంప్రసాద్, వెలుగు సిసిలు, ఎపిఒ శైలజ, హౌసింగ్ ఎఇ ప్రకాశరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

మేదరమెట్ల : మండలంలోని పమిడిపాడు గ్రామంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. పెన్షన్లు, గృహాలు, రేషన్‌కార్డులు, చంద్రన్న బీమా, మరుగుదొడ్లు వంటి వాటిపై వచ్చిన అర్జీలపై సంబంధిత అధికారులు వివరణ ఇచ్చారు.

ఈ సందర్భంగా తహశీల్దార్ ఎస్.శివనాగిరెడ్డి మాట్లాడుతూ సభలో 113 అర్జీలు వచ్చాయని, వాటిలో 83 ధరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. హౌసింగ్ ఎఇ హరిత మాట్లాడుతూ గ్రామానికి 102 గృహాలు మంజూరయ్యాయని వాటిలో 62 గృహాలకు పూర్తి బిల్లులు చెల్లించామని పేర్కొన్నారు. ఎఒలు, ఎపిఎం దేవరాజు, ఎపిఒ గాయత్రి, పిఆర్‌ఎఒ ప్రసాదరావు, ఎంఇఒ ఎల్.పున్నయ్య, మండల అధ్యక్షురాలు రావి ప్రభావతి, గ్రామ సర్పంచి రావి శ్రీధర్, ఇఒఆర్‌డి లక్ష్మీకాంత సభకు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి పాలపర్తి రవి, కో ఆప్షన్ సభ్యులు మీరావలి పాల్గొన్నారు.

పంగులూరు : మండలంలో మంగళవారం ప్రారంభమైన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో తొలిరోజు ప్రజల నుండి అధికారులకు తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. అన్ని అర్హతలు ఉన్నా కక్షపెట్టుకొని కొంత మందికి పనులు చేయడం లేదని, సొంత వారికే ప్రభుత్వ పథకాలు అమలవుతున్నాయని అధికారులను నిలదీశారు. జనకవరంలో జరుగుతున్న జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో బాచిన ప్రకాశరావు అనే వ్యక్తి తన ఫించన్ ఎందుకు ఆపారని నిలదీశారు. ఎంతో మంది అనర్హులకు పింఛన్లు ఇస్తున్నా అన్ని అర్హతలున్న తనకు ఎందుకు ఆపారని అధికారులపై మండిపడ్డారు. స్పందించిన ఎంపిడిఒ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ అన్ని కాగితాలు సమర్పిస్తే పింఛన్ మంజూరు చేస్తామని చెప్పారు. ఆ సమయంలో సభలో గందరగోళం నెలకొంది. కార్యక్రమంలో తహశీల్దార్ పార్వతి, ఇఒఆర్‌డి రాంబాబు, విఆర్‌ఒ సుబ్బారావు, ఆర్ఐ.రామకృష్ణ, ఎంపిటిసి విశ్రాంతమ్మ, పిఆర్‌ఎఇ రామ్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ బ్రహ్మయ్య, విద్యుత్ ఎఇ బ్రహ్మాచారి, ఎపిఎం అనురాధ, ఎఒ నిర్మల పాల్గొన్నారు.




అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

బిల్లులు ఇప్పించండి మహాప్రభో

మండలంలోని కొప్పెరపాడు, ఎస్-ఎల్ గుడిపాడు గ్రామాలలో మంగళవారం నిర్వహించిన జన్మభూమి-మాఊరు గ్రామ సభల్లో మరుగుదొడ్ల బిల్లులు కోసం లబ్ధిదారులు గగ్గోలు పెట్టారు. కొప్పెరపాడు గ్రామ సభలో ఉపాధిహామీ కూలి డబ్బులు నెలల తరబడి అకౌంట్లలో జమకావడం లేదని పరిటాల పవన్‌కుమార్ మరికొంతమంది గ్రామస్తులు అధికారులను నిలదీశారు.

గతంలో మరుగుదొడ్లు నిర్మించుకున్న సుమారు 30 మంది లబ్ధిదారులకు తొలి విడత రూ.6 వేల బిల్లులను చెల్లించలేదని, రెండో విడత బిల్లు రూ.9 వేలు బ్యాంక్ అకౌంట్‌లో జమ అయ్యాయని అడకా పుల్లయ్య, దమ్ము అంజయ్య, కుంచెపు అంకారావు ఎంపిడిఒ దృష్టికి తీసుకొచ్చారు. మరుగుదొడ్ల బిల్లుల చెల్లింపులో అవకతవకలు జరిగాయని, దీనిపై విచారణ జరిపించాలని కోరారు. ఎంపిడిఒ సమాధానం ఇవ్వకపోవడంతో కొంతసేపు వాగ్వివాదం చోటు చేసుకుంది. గత జన్మభూమిలో పింఛన్ల కోసం అర్జీలు ఇచ్చామని, వారికి ఇంత వరకు పింఛన్లు మంజూరు కాలేదని ఎంపిడిఒని నిలదీశారు. గుడిపాడు గ్రామంలో పాత మరుగుదొడ్ల బిల్లుల గురించే లబ్ధిదారులు అధికారులకు మొరపెట్టుకున్నారు. అధికారుల్లో ఎలాంటి స్పందన లేకపోవడంతో లబ్ధిదారులు నిరాసగా వెనుదిగారు. కార్యక్రమాల్లో అధికారులు ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

- ప్రజాశక్తి, బల్లికురవ



అదంకి సినిమాలు

సత్యనారాయణ కళామందిర్	-	బాలకృష్ణుడు
శ్రీరామా టాకీస్	-	ఉన్నది ఒక్కటే జిందగీ
విఎన్ఎస్	-	హేయ్ పిల్లగాడ
మినీ విఎన్ఎస్ ఏ/సి	-	దేవి శ్రీ ప్రసాద్

దర్శి సినిమాలు

వెంకటేశ్వరులో	-	ఖాకి
శివశంకర్‌లో	-	బాలకృష్ణుడు
శ్రీనివాస్‌లో	-	గరుడవేగ
భాస్కర్‌లో	-	ఏంజెల్

గ్రంథాలయంలో వార్షిక తనిఖీలు

ప్రజాశక్తి-సంతమాగులూరు

జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాలకు రూ.10 కోట్లకు పైగా చెస్ బకాయిలు ఉన్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెన్నా పోలిరెడ్డి తెలిపారు. సంతమాగులూరు పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని మంగళవారం వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలలో, గ్రామ పంచాయితీలలో నిధులు పేరుకుపోయి ఉన్నాయన్నారు. అందుకే మంజూరైన శాశ్వత బిల్డింగ్‌లు కట్టించలే కపోతున్నామన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 18 గ్రంథాలయ బిల్డింగ్‌లు కట్టించాల్సి ఉందని, హనుమంతునిపాడు, మద్దిపాడులో మాత్రమే బిల్డింగ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా కేంద్ర శాఖ గ్రంథాలయాలు 65, గ్రామీణ గ్రంథాలయాలు 10 వరకు ఉన్నాయన్నారు. దాతలు సహకరిస్తే ఇవి మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు బాదం విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వి.పోలిరెడ్డి

దర్శి

నూజెళ్లపల్లిలో జన్మభూమి ప్రారంభం

ప్రజాశక్తి-ముండ్లమూరు

మండలంలోని తూర్పుకంభంపాడు, నూజెళ్లపల్లి గ్రామాలలో మంగళవారం జన్మభూమి - మాఊరు కార్యక్రమం జరిగింది. సర్పంచి పందిరి వెంకటరావు ఆధ్వర్యంలో నూజెళ్లపల్లిలో జరిగిన కార్యక్రమంలో తహశీల్దార్ బి.గంగాధరరావు పాల్గొని మాట్లాడారు. రేషన్ కార్డులు కోసం 15, పింఛన్ కోసం 4 అర్జీలు వచ్చాయని తెలిపారు. తూర్పు కంభంపాడు గ్రామంలో సర్పంచి హనుమంతరావు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. రేషన్ కార్డుల కోసం 2, పింఛన్ కోసం 3 అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో విఆర్‌ఒ పెద్దన్న, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దర్శికి తరలివెళ్లిన నాయకులు

ప్రజాశక్తి-ముండ్లమూరు

దర్శిలో మండలంలో సిఎం చంద్రబాబునాయుడు సమక్షంలో నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి వివిధ గ్రామాల నుండి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఎంపిపి మందలపు వెంకటరావు, సర్పంచి మేదరమెట్ల వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షులు సోమేపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

ముగిసిన విఠల్‌రాజ్ అంత్యక్రియలు

ప్రజాశక్తి-పంగులూరు

జానపద, పౌరానిక రంగస్థల నటుడు సిపిఎం సానుభూతి పరుడు జొన్నలగడ్డ విఠల్‌రాజు (75) అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన పంగులూరులో మంగళవారం ముగిశాయి. అనారోగ్యంతో బాధపడుతున్న విఠల్ రాజు సోమవారం ఉదయం ఒంగోలులోని రిమ్స్‌లో చికిత్స పొందుతూ మరణించారు. విఠల్ రాజు 50 ఏళ్లుగా రంగస్థల నటుడిగా ఏపి, తెలంగాణా రాష్ట్రాలలో పలు ప్రదర్శనలు చేపట్టారు. మాజీ ముఖ్యమంత్రి కాసుబ్రహ్మాందరెడ్డి చేతులమీదగా బహుమతులు అందుకున్నారు. సురభి నాటక సంస్థలలో కూడా పనిచేశాడు. విఠల్ రాజు సిపిఎం అభిమానిగా చనిపోయేవరకు కొనసాగాడు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రాయని వినోద్‌బాబు, లక్ష్మణరాజు పాల్గొన్నారు.

సాంకేతికతతో పురోగతి

ప్రజాశక్తి-పంగులూరు

ప్రతి విద్యార్థి శాస్త్ర సాంకేతిక రంగాలలో పురోగతి సాధించాలని కొండమంజులూరు గ్రామ సర్పంచి చింతల విజయలక్ష్మి కోరారు. కొండమంజులూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ క్లాసులను మంగళవారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ప్రతి హైస్కూల్‌కు డిజిటల్ పరికరాలు అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఈ క్లాసుల ద్వారా సాంకేతిక రంగంలో ఉన్న అనేక విషయాలు తెలుసుకొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు వీరాంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బొప్పూడి శ్రీనివాసరావు, స్థల దాత సుబ్బారావు, స్వాములు, ఉపాధ్యాయులు ప్రసాద్, రామకోటిరెడ్డి పాల్గొన్నారు.

9వ వార్డులో నేడు ఇంటింటికీ టిడిపి

ప్రజాశక్తి-అద్దంకి

పట్టణంలోని 9వార్డులో నేడు ఇంటింటికీ టిడిపి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి స్థానిక శాసన సభ్యులు రవికుమార్ హాజరవుతారని తెలిపారు.

సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి-మేదరమెట్ల

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో స్థానిక పమిడిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఐదుగురు గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. కార్యక్రమంలో ఎంపిపి రావి ప్రభావతి, గ్రామ సర్పంచి రావి.శ్రీధర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు కె.ఇందిర, కె.దేవసేన, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలిగండ్లలో అధికారుల నిలదీత

ప్రజాశక్తి- వెలిగండ్ల

మండలంలోని గుడిపాటిపల్లిలో మంగళవారం జరిగిన జన్మభూమి-మాఊరు కార్యక్రమం రసాభాసగా మారింది. ప్రభుత్వం పేద ప్రజలకు భూ పంపిణీ కార్యక్రమంలో భాగంగా పంపిణీ చేసిన పట్టాలకు హద్దులు చూపలేదనే విషయంపై బాధితులు అధికారులు, నాయకులను నిలదీశారు. 2005లో మొదటి విడత భూ పంపిణీ కార్యక్రమంలో భాగంగా పిఎన్‌వరం రెవెన్యూ పరిధిలోని గుడిపాటిపల్లి గ్రామస్థులకు అదే రెవెన్యూ పరిధిలోని జాళ్లపాలెం పిఎన్‌వరం పంచాయతీలో 144 ఎకరాల భూమిని 79 మంది గుడిపాటిపల్లి గ్రామానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు సంబంధించిన పట్టాలు పంపిణీ చేశారు. అందులో 35 మందికి నేటి వరకు భూములు స్వాధీనం చేయలేదని వారు ధ్వజమెత్తారు. గతంలో జరిగిన ప్రజాపదం నాల్గవ విడతల జరిగిన జన్మభూమి కార్యక్రమాలలో అర్జీలు ఇచ్చినప్పటికి అధికారులు పట్టించుకోలేదని నిలదీశారు. ప్రజల సమస్యలు పరిష్కరించలేదని కార్యక్రమాలు ఎందుకని ఎన్నిసార్లు అధికారులు, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదన్నారు. గ్రామానికి చెందిన పరిసపోగు విశ్రాంతమ్మ, దేవమ్మలు ఐదుసార్లు జిల్లా గ్రీవెన్స్‌కు అర్జీలు ఇచ్చినట్లు తెలిపారు. 1బి, అడంగల్‌లో మాపేర్లు ఉన్నాయని, పాసుపుస్తకాలు ఉన్నా కానీ ఇంత వరకు భూమి చూపకపోవడం చాలా దారుణమైన విషయమని వారు వాపోయారు. ఆ పొలాలైన మాకు చూపించండి లేదా ప్రత్యామ్నాయ మార్గమైనా చూపండి అంటూ అధికారులను నిలదీశారు. తక్షణమే సమాధానం చెప్పాలని గ్రామస్థులు భీష్మించారు. ఇఒఆర్‌డి రామమోహన్‌రెడ్డి విషయాన్ని తహశీల్దార్ ఇ.చంద్రావతికి ఫోన్‌లో వివరించారు. తహశీల్దార్ హామీ మేరకు గ్రామస్తులు శాంతించారు. గుడిపాటిపల్లిలో సర్పంచ్ అన్నపురెడ్డి హేమలత, పిఎన్‌వరంలో ముక్కు మహాలక్ష్మమ్మ అధ్యక్షతన జన్మభూమి కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంపిపి ముక్కు జయరామిరెడ్డి, జన్మభూమి కమిటీ సభ్యులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, గోనా ప్రతాప్, వెన్నా రమణారెడ్డి, ఎంపిటిసి సైకం అక్కమ్మ, ఎఇ జైనులాబ్దిన్, విద్యుత్ ఎఇ షేక్. జిలాని, ఎంపిడిఒ యజ్ఞేశ్వరరావు, ఎంఇఒ దాస్‌ప్రసాద్. ఆర్ఐ ప్రభాకర్, సిడిపిఒ లక్ష్మీప్రసన్న, సూపర్‌వైజర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.



వెలిగండ్ల గ్రామ సభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు



సి.ఎస్. పురంలో జన్మభూమి గ్రామసభ

కనిగిరి

తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని మున్సిపల్ చైర్మన్ షేక్‌చినమస్తాన్ పేర్కొన్నారు. మంగళవారం నగరపంచాయతీ పరిధిలోని 6వార్డు మాచవరంలో జన్మభూమి – మా ఊరు కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే కదిరిబాబురావు సహకారంతో కనిగిరి నగరపంచాయతీని అభివృద్ధి పథంలో నడిపేందుకు తాము కృషిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వివిఆర్ మనోహర్‌రావు, కౌన్సిలర్లు వంటిపెంట దీప్తి, రాచమళ్ళ శ్రీనివాసులరెడ్డి, షేక్ ఫయాజ్, కమీషనర్ కెవి పద్మావతి, టిడిపి నాయకులు వెంకటరెడ్డి, నాగిరెడ్డి, బారాయిమాం, మెప్మాసిబ్బంది ,మున్సిపల్ సిబ్బంది,వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సిఎస్‌పురం :

పేద ప్రజల, రైతుల సంక్షేమం కోసం టిడిపి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మండల ఇన్‌ఛార్జి కదిరి ప్రకాశరావు, ఎంపిపి టి.పెద అల్లూరయ్య, జడ్‌పిటిసి ఎం. డేవిడ్, ఎంపిడిఒ ఎ. శ్రీనివాసులులు పేర్కొన్నారు. మండలంలోని చెన్నపునాయునిపల్లి, చెర్లోపల్లి గ్రామాలలో జన్మభూమి–మాఊరు ఐదవ విడత కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల గురించి వక్తలు ప్రజలకు వివరించారు. గ్రామానికి చెందిన పీస్‌ఫుల్ హోమ్ ప్రైవేటు లిమిటెడ్ కన్షక్షన్ బిల్డర్ కుక్కల తిరుపతిరావు తల్లి ఆదిలక్ష్మమ్మ జ్ఞాపకార్థం ఐదుగురి గర్భిణీలకు ఉచితంగా ఒక్కొక్కరికి రూ.4వేల వంతున రూ.20వేలు అందచేశారు. అదే గ్రామానికి చెందిన పి. తిరుపతయ్య గర్భిణీలకు సీమంతాలు నిర్వహించి ఉచితంగా వారికి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెర్లోపల్లి, చెన్నపునాయునిపల్లి సర్పంచ్‌లు పులిమి ఆదినారాయణ, డి. జానకిరాములు, ఉప సర్పంచ్ జి. వెంకటేశ్వర్లు, హౌసింగ్, ఆర్‌డబ్లుఎస్, ఎలక్ట్రిసిటి ఎఇలు రామనాథం, పవన్‌కుమార్, రామకోటి, పిఆర్‌ఎఇ మస్తాన్‌వలి, డి.టి వెంకటేశ్వర్లు, ఆర్ఐ వెంకటయ్య, ఎంఇఒ ప్రసాద్‌రావు, పశువైద్యాధికారి మున్నీర్, ఎపిఒ రాంబాబు, ఎపిఎం చిన్నయ్య, పాపయ్య, అద్దంకి వెంకటయ్య, కుక్కల వెంకటాద్రి, తిరుపతయ్య, అంగలకుర్తి తిరుపాలు, గ్రామ పార్టీ అధ్యక్షులు అన్నెబోయిన గురువయ్య, తదితరులు పాల్గొన్నారు.

పునుగోడు,బొమ్మిరెడ్డిపల్లిలో జన్మభూమి

మండలంలోని పునుగోడు, బొమ్మిరెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం జన్మభూమి కార్యక్రమం జరిగింది. పునుగోడులో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఎమ్మెల్యే కదిరిబాబురావు పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చొరవచూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నంబుల వెంకటేశ్వర్లు, సర్పంచ్ తప్పెట జీవకళ, ఉపసర్పంచ్ మాలపాటి ఓబుల్‌రెడ్డి, టిడిపి నాయకులు బేరి పుల్లారెడ్డి,ముచ్చుమారి చెంచిరెడ్డి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి డిమాండ్

ప్రజాశక్తి-సిఎస్‌పురం

రైతులు ఎదుర్కుంటున్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం ఆనికాళ్లపల్లి శాఖా కార్యదర్శి ఎస్‌కె. ఖాజావలి డిమాండ్ చేశారు. ఆనికాళ్లపల్లిలో పార్టీ శాఖా సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సిమెంట్ రోడ్లుకు ఇరువైపులా మట్టితో చదును చేయకపోవడం వల్ల గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఉపాధి పనులు వెంటనే ప్రారభించాలన్నారు. కనిగిరిలో జనవరి 8, 9, 10వ తేదీలలో జరిగే జిల్లా మహాసభల సందర్భంగా గ్రామంలో విరాళాలు సేకరించారు. 8న కనిగిరిలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలగోవిందయ్య, నారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

షష్టిపూర్తి వేడుకలకు సిద్ధం

ప్రజాశక్తి-వెలిగండ్ల

ఈనెల 13వ తేదిన మండలంలోని గుడిపాటిపల్లి కెఎెం ఉన్నత పాఠశాలలో షష్టి పూర్తి వేడుకలు నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ కెఎం దాస్ తెలిపారు. ఈ పాఠశాలను 1958లో స్థాపించామనీ, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు, శ్రేయోభిలాసులు, ప్రతి ఒక్కరు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా ఆయన కోరారు.

నేడు సావిత్రిబాయి పూలే జయంతి

ప్రజాశక్తి-కనిగిరిటౌన్

భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా రాష్ట్ర మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని బుధవారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ కనిగిరి మండల సహాధ్యక్షురాలు ఎల్ ఆదిలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జయంతిని రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉపాధ్యాయదినోత్సవంగా ప్రకటించిందని ఈవేడుకలను ఘనంగా నిర్వహించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహిళాఉపాధ్యాయులందరూ తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

చంద్రన్న బీమా పంపిణీ

ప్రజాశక్తి - పామూరు

చంద్రన్న భీమా పథకం ప్రతికుటుంబానికి ఉపయోగపడేలా అధికారులు కృషి చేయాలని కనిగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని ఆయన్నకోటా బోడావడా పంచాయతీలో మంగళవారం ఐదవ విడుత జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వలో ప్రతి పేదవాడికి పథకాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నాగభూషణం, తహశీల్దార్ జి. వెంకటేశ్వర్లు, పి. వెంకటేశ్వర్లు, ఎంపిపి ఆవుల నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి పూవాడి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సమస్యలకు తక్షణ పరిష్కారం : తహశీల్దార్

ప్రజాశక్తి-ఉలవపాడు

ఉలవపాడు మండలం ఆత్మకూరులో మంగళవారం నాడు మండల స్థాయి అధికారులతో జన్మభూమి కార్యక్రమం లాంఛనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఐ.పద్మావతి మాట్లాడుతూ భూములకు సంబంధించి ఆన్‌లైన్ సమస్యలు ఉంటే నేరుగా తనవద్దకు వస్తే పరిష్కరిస్తానని చెప్పారు. ప్రజలు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలోని రోడ్లు, ఇళ్ళ స్థలాలు, భూములకు సంబంధించి అనేక సమస్యలు ఉన్నాయని అవి ఇంత వరకు తీరలేదని గ్రామస్తులు ఆమెకు వివరించి అర్జీలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రభాకర్‌బాబు, ఎంఇఒ కోటేశ్వరరావు, వైద్యాధికారులు బ్రహ్మయ్య, డాక్టర్ శ్రీనివాసరావు, ఇఒఆర్‌డి ఈశ్వరమ్మ, ఎఒ కిషోర్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ రాజశేఖర్, ఎంపిపి జువ్విగుంట చిన్నమ్మి, వైస్ ఎంపిపి గొత్తుల బ్రహ్మయ్య, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఎస్‌కె.బాజీ, సర్పంచ్ కె.వెంకట్రావు, ఎపిఒ, ఎపిఎం వెంకటసుజాత, సుబ్బారావు, ఆరోగ్యకార్యకర్తలు, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం పోలీసుల సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఆంధ్రప్రదేశ్ స్పెషల్ సెక్యూరిటీ ఫోర్స్ ఆధ్వర్యంలో పర్యవరణ పరిరక్షణతో ప్రజల ఆరోగ్యం అనే అశంపై నిర్వహిస్తున్న ర్యాలీ మంగళవారం శింగరాయకొండకు చేరుకుంది. శ్రీకాకుళం నుంచి మొదలైన ఈ ర్యాలీ అనంతపురం వరకు వెళ్తుంది. సైకిల్ తొక్కుకుంటూ స్పెషల్ సెక్యూరటీ పోలీసులు ర్యాలీని నిర్వహిస్తున్నారు. అప్పటి డిజిపి ఎన్.సాంబశివరావు ఈ ర్యాలీని ప్రారంభించారు. అడిషినల్ కమాండింగ్ ఎస్‌పి కెఎన్.రావు ఆధ్వర్యంలో సాగుతుంది. శింగరాయకొండకు వచ్చిన ఈ ర్యాలీని ఆర్‌టిసి బస్టాండ్ వద్ద భాష్యం, శ్రీచైతన్య, సెయింట్ జోన్, శ్రీవిద్యానికేతన్ విద్యార్థులు భారీ స్వాగతం పలికారు. రైటర్ ఎస్‌కె.మొహిద్దీన్, ఎస్‌కె.ఖాసీం పోలీస్‌స్టేషన్ వద్ద పూలతో స్వాగతం పలికి అల్పాహారాన్ని అందించారు. సందర్భంగా అడిషినల్ కమాండింగ్ ఎస్‌పి కెఎన్.రావు మాట్లాడుతూ 50 మంది పోలీసులు సైకిల్‌పై ర్యాలీ నిర్వహిస్తున్నారన్నారు. సైకిల్ మీద తిరగడం ద్వారా ఆరోగ్యం కూడా బాగుంటుందని దీనిని ప్రతి పౌరుడు అర్థం చేసుకుని సైకిల్‌ను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి ఆశీర్వాదం తదితరులు ఉన్నారు.



శింగరాయకొండకు చేరిన సైకిల్ ర్యాలీ

'ఓబయ్య మృతి తీరని లోటు'

ప్రజాశక్తి - పామూరు.

టిడిపి నాయకులు ఓబయ్య మృతి పార్టీలకు తీరని లోటు అని కనిగిరి శాసన సభ్యులు కదిరి బాబు రావు అన్నారు. మండలంలోని బుక్కపురం గ్రామానికి చెందిన పి. ఓబయ్య (59) గత కొంత కాలం నుంచి ఆనారోగ్యంతో బాదపడుతున్నారు. సోమవారం రాత్రికి ఆయన నివాసంలో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని పలురాజకీయపార్టీ నాయకులు సానుభూతి తెలిపారు. టిడిపి నాయకులు పూవ్వాడి రాంబాబు , వెంకటేశ్వర్లు, ఎంపిపి ఆవుల నాగేశ్వరరావు, మాజీ శాసన సభ్యులు ఉగ్ర నరసింహరెడ్డి వైసిపి కనిగిరి ఇన్‌ఛార్జి బుర్ర మధుసూదన్ యాదవ్ , గంగసాని ఉషేన్‌రెడ్డి, చాంద్ బాషా, రామిరెడ్డి కోండారెడ్డి నాగరాజు యాదవ్ ఉషేన్‌రావు, నివాళులర్పించారు.

పార్లమెంట్‌పై యువతకు అవగాహన



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి-కనిగిరి

యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని జాతి నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలని మున్సిపల్ చైర్మన్ షేక్ చినమస్తాన్ తెలిపారు. నగరపంచాయతీ పరిధిలోని టకారిపాలెంలో నెహ్రుయువ కేంద్రం తరపున ప్రగతి యువజన సంఘం అధ్యక్షులు షేక్ ఖాశీం గ్రామస్థాయి నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్‌పై యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ యువత అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలను రూపొందించి అమలుజేస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి చైతన్యపచాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు రాచమళ్ళ శ్రీనివాసులరెడ్డి, షేక్ ఫయాజ్, ప్రగతి యువజన సంఘం సభ్యులు చాంద్‌బాషా, ఖాశీంపీరా, బాషా, యాసిన్, రషీద్, మస్తాన్, చెన్నకేశవులు, మస్తాన్‌వలి, అల్లాబగాష్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి కానుకలు అందజేత

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద మంగళవారం నాడు చంద్రన్న సంక్రాంతి కానుకలను తెలుగుదేశం పార్టీ నాయకులు కూనపరెడ్డి వెంకటసుబ్బారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఎన్నో ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి సంక్రాంతి జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ కానుకలు అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వలేటి రవిశంకర్‌రెడ్డి, డీలర్ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే సంక్షేమ ఫలాలు

- జన్మభూమిలో పాల్గొన్న ఎమ్మెల్యే
- కొత్త రేషన్‌కార్డులు పంపిణీ
- సమస్యలపై ప్రజల నిలదీత



కందుకూరులో రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



కె.బిట్రగుంటలో స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న ఎంపిపి

ప్రజాశక్తి-కందుకూరు

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించేందుకే ప్రభుత్వం జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తుందని స్థానిక శాసన సభ్యుడు పోతుల రామారావు పేర్కొన్నారు. కందుకూరు పట్టణంలోని 1,2,3,4 వార్డులలో మంగళవారం జరిగిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ఎమ్మెల్యే రామరావు పాల్గొని మాట్లాడారు. ప్రతి వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. జనార్ధనకాలనీ ప్రాంతంలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇంకా జరగాల్సిన కార్యక్రమాలు ఏమైన ఉంటే జన్మభూమి సభలో చెప్తే చేస్తామని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు అందాలనే దృష్టితోనే జన్మభూమి కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా రామారావు కొత్త రేషన్‌కార్డులు, సంక్రాంతి కానుకలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం, మున్సిపల్ కమీషనర్ సిహెచ్.శ్రీనివాసన్, మున్సిపల్ డిఇ ప్రసాద్, ఎఇ పద్మజ, మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, మాజీ శాసనసభ్యులు కసుకుర్తి ఆదెన్న తదితరులు పాల్గొన్నారు.

పొన్నలూరు : మండలంలో కోటపాడు, మేకపాడు, చెన్నుపాడు గ్రామాలలో మంగళవారం 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మండవ వీరకుమారి మాట్లాడారు. ఫించన్‌లు, రేషన్ కార్డులు, భూ సమస్యలు, గ్రామాల్లో పలు సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తారని ఆమె అన్నారు. జెడ్.మేకపాడు గ్రామంలో బాలామృతాన్ని ఎంపిపి చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల మాజీ అధ్యక్షులు మండవ ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ఎంపిటిసి పతకమూరి సరస్వతి, వున్నం బసవయ్య, పి.చంద్రయ్య, కె.మాధవరావు, సన్నమూరు నరసింహరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జరుగుమల్లి : మండలంలోని కె.బిట్రగుంట, నందనవనం గ్రామాలలో మంగళవారం జరిగిన 5వ విడత జన్మభూమి కార్యక్రమంలో ఎంపిపి పోటు పద్మావతి పాల్గొన్నారు. రేషన్‌కార్డులు, ఈపాస్ పుస్తకాలు, విద్యార్థులకు చంద్రన్న స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ బివిఆర్.ప్రసాద్, ఎంపిడి పి.విజయలక్ష్మి, గృహనిర్మాణ డిఇ దాశరధి శర్మ, దేశం నాయకులు పోటు శ్రీనివాసమురళీ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పొన్నగంటి వెంకట నరసయ్య, సర్పంచ్‌లు శీలం భారతి, జెడ్పిటిసి దేవరపల్లి పద్మ, వ్యవసాయ అధికారి పి.తిరుమలజ్యోతి, పిఆర్‌ఎఇ హనుమంతరావు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : ప్రజలకు సేవలందించేందుకు 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమం ప్రతి ఏటా ప్రభుత్వం నిర్వహిస్తుందని కందుకూరు శాసనసభ్యులు పోతుల రామారావు అన్నారు. కార్యక్రమంలో భాగంగా అధికారుల బృందం మండలంలోని బడేవారిపాలెం, కాకుటూరు గ్రామాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా బడేవారిపాలెంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల సంక్షేమానికి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాళ్ళపాడు-రోళ్ళపాడు, చుండి-చెర్లోపాలెం తాగునీటి పథకాల ద్వారా సుమారు 61 గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని ఫిల్టర్ చేయడానికి రూ. 5 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. చెత్తసేకరణకు కేటాయించిన ఆటోను, రిక్షాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. జన్మభూమి నియోజకవర్గ ప్రత్యేకాధికారి నాగభూషణ శర్మ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఎంపిపి బండారు మాధవి, జన్మభూమి కమిటి సభ్యులు ఘట్టమనేని సుబ్బారావు, తహశీల్దార్ సుబ్బారావు, ఎంపిటిసి పెరుగు రాధ, టిడిపి నాయకులు ఇంటూరి నాగేశ్వరరావు, ఇంటూరి రంగారావు, ఉన్నం మోహన్‌రావు, ఎంపిడిఒ పర్రె విజయశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లింగసముద్రం : ఐదో విడత జన్మభూమి కార్యక్రమం మండలంలోని మొగిలిచర్ల, ఆర్‌ఆర్‌పాలెం గ్రామాల్లో మంగళవారం జరిగింది. ఎంపిడిఒ వై మహాలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వరరావు రెండు టీములు గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొగిలిచర్ల గ్రామంలో పశువైద్యశాలకు డాక్టర్‌ను నియమించాలని పశు పోషకులు అధికారుల దృష్టికి తెచ్చారు. త్వరలోనే వైద్యులను నియమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పశువైద్యాధికారి మనురూప్ చెప్పారు. డిడిలు కట్టినా కూడా విద్యుత్ లైను లాగడం లేదని రైతులు విద్యుత్ శాఖ ఎఇ రాఘవేంద్రను నిలదీశారు. అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మంజూరైన పింఛన్లు, రేషన్‌కార్డులను లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రవిచంద్ర, ఎపిఎం మధుసూదన్, ఎపిఒ నాగరాజు, ఎంఇఒ కాంతారావు, ఫారెస్ట్ అధికారి సురేష్, వైస్ ఎంపిపి సింహాద్రి, మొగిలిచర్ల, ఆర్‌ఆర్‌పాలెం సర్పంచ్‌లు శ్యామల, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్శింగోలు సర్పంచికి మాతృవియోగం

ప్రజాశక్తి-జరుగుమల్లి

మండలంలోని నర్శింగోలు సర్పంచ్ పాతూరి కోటేశ్వరరావు తల్లి అలివేలమ్మ (92) మంగళవారం ఉదయం 6గంటలకు మృతిచెందారు. విషయం తెలిసిన దామచర్ల సత్యనారాయణ నర్శింగోలు వచ్చి అలివేలమ్మకు నివాళు లర్పించి కోటేశ్వరరావును పరామర్శించారు. సర్పంచ్ పరామర్శించిన వారిలో ఎంపిపి పోటు పద్మావతి, పోటు శ్రీనివాసమురళీ, గాలి సందీప్, పోకూరి రవీంద్రబాబు, నరాల సోమయ్య, దగ్గుమాటి సుబ్బారెడ్డి, పోకూరి నరేంద్రబాబు, నరాల సోమయ్య, సర్పంచ్‌లు ఏలూరి రాంబాబు, కామేపల్లి, చదలవాడ బ్రహ్మేంద్రం కాకుటూరు, నాయకులు బత్తిన కృష్ణారావు, ఎనిమిరెడ్డి బాబు, కంచర్ల ప్రసాద్, కొమ్మాలపాటి కృష్ణ, రావిపాటి శేషయ్య, పలువురు నాయకులున్నారు.

రికార్డుల తనిఖీ

లింగసముద్రం : మండలంలోని మొగిలిచర్ల ప్రాథమిక పాఠశాల రికార్డులను మండల విద్యాశాఖాధికారి టిఎల్ కాంతారావు తనిఖీ చేశారు. . ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పాఠశాల నిర్వహణ పరిశు భ్రంగా ఉండాలన్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఆయన వెంట మల్లెబోయిన సుధాకరారవు, రమణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ

ప్రధానోపాధ్యాయుల సమావేశం

ప్రజాశక్తి-లింగసముద్రం

స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి టిఎల్ కాంతారావు మాట్లాడుతూ 2 నుండి 9వరకు మండలంలో జరిగే జన్మభూమి కార్యక్రమాలకు విద్యాశాఖ తరఫున చేయవలసిన కార్యక్రమాలను వివరించారు. ప్రతి పంచాయతీ ఒక ప్రధానోపాధ్యాయుడిని నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లింగసముద్రం హైస్కూలు ప్రధానోపాధ్యాయులు కె సూర్యప్రకాశరావు, సిఆర్‌పిలు రాము, ఆశీర్వాదం, పురుషోత్తం పాల్గొన్నారు. అనంతరం యుటిఎఫ్ నాయకులు ఎంఇఒను కలిసి క్యాలెండర్, డైరీని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ నిలిపివేత

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు పట్టణంలో బుధవారం విద్యుత్ సరఫరా కొన్ని ప్రాంతాల్లో నిలిపివేస్తున్నట్లు పట్టణ ఎఇ మధుబాబు చెప్పారు. కవర్డ్ కండక్టర్ ఏర్పాటు చేస్తున్నందున పట్టణంలోని కోటారెడ్డినగర్, ఆదిఆంధ్రకాలనీ, తూర్పువడ్డిపాలెం, తూర్పుకమ్మపాలెం ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ అసౌకర్యానికి సహకరించాలని కోరారు.

నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు శ్రీ వివేకా డిగ్రీ కాళాశాలలో కమ్యునికేషన్స్, స్కిల్స్ , బ్యాంక్ కోచింగ్ తరగతుల ప్రారంభం అయినట్లు కళాశాల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు . ప్రిన్సిపాల్ దామా మహేశ్వరరావు, జూనియర్ కాలేజి ప్రిన్సిపల్ అబ్బూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ తరగతులు నిర్వహించబడతాయని చెప్పారు. తరగతులు నిర్వహించడానికీ ఇంగ్లీష్‌లో ప్రావీణ్యత గలిగిన శీలం రామకృష్ణ నిర్వహిస్తారు., బ్యాంక్ కోచింగ్ క్లాసులను కె.రవికుమార్ నిర్వహిస్తారని చెప్పారు. ఈ తరగతులకు డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు.

చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

రాష్ట్ర ప్రభుత్వం తెల్లరేషన్‌కార్డులు కలిగిన వారందరికీ సంక్రాంతి కానుకలను ఉచితంగా అందజేస్తున్నట్లు శాఖవరం సాగునీటి సంఘం అధ్యక్షులు ఉన్నం పాండురంగారావు తెలిపారు. మండలంలోని శాఖవరం గ్రామంలో సంక్రాంతి కానుకలను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలందరిని దృష్టిలో ఉంచుకొని ఉచితంగా సరుకులు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ వడ్లమూడి రామకృష్ణ ఉన్నారు.

నేడు ఉపాధ్యాయినుల సమావేశం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ నెల 3న బుధవారం సాయంత్రం 4 గంటలకు కందుకూరులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సమావేశం నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎం లెనినా పేర్కొన్నారు. సమావేశంలో కందుకూరు ప్రాంతీయ మండలాలైన కందుకూరు, పొన్నలూరు, వలేటివారిపాలెం, గుడ్లూరు, లింగసముద్రం మండలాలకు సంబంధించిన మహిళా ఉపాధ్యాయులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సాగునీటి సాధనే ధ్యేయం : రైతుసంఘం

ప్రజాశక్తి-కొండపి



మాట్లాడుతున్న పమిడి వెంకట్రావు

ముసి నదికి నీటిని సాదించుకునేందుకు రైతులు ఐక్యంగా పోరాడాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు పిలుపునిచ్చారు. మంగళవారం కొండపిలోని గుడిపల్లి చందు కళ్యాణ మండపంలో నిర్వహించిన ముసిపరివాహక రైతుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నేపథ్యంలో ముసి వెంబడి కూడా పంటలు ఎండుతున్నాయన్నారు. సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావును కూడా కలిసినట్లు తెలిపారు. దీనిపై ఆయన కూడా సానుకూలంగా స్పందించారని అధికారులతో మాట్లాడారని తెలిపారు. తాళ్లూరు మండలం నిప్పట్లపాడు మేజర్ నుంచి నీరు వదిలేందుకు అవకాశం ఉందన్నారు. ఇక్కడ గోడ తొలగించి నీరు వదిలిని తర్వాత తిరిగి నిర్మించాలని అదికారులు సూచించారన్నారు. తిరిగి అక్కడ షెటర్ నిర్మించుకుంటే నీరు ఎప్పుడు అవసరమైనా తీసుకునే వీలుందన్నారు. అవసరమైతే గ్రామకమిటీలైనా తిరిగి గోడ నిర్మించుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ మార్గంలో 2002, 2003 సంవత్సరాలలో అక్కడి ఎస్కేప్ ఛానల్ ద్వారా నీరు వదిలారన్నారు. అయితే రామతీర్థం జలాశయ నిర్మాణ సమయంలో ఈ మార్గాన్ని పూర్తిగా మూసి గోడ కట్టడంతో ప్రస్థుతం ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా తలుపులు నిర్మించాలన్నారు. దీనిపై గ్రామాలలో రైతుల కమిటిగా ఏర్పడి ముసినదికి నీరు తెచ్చేందుకు కావలసిన నిదులు అంటే ఎస్‌కేప్ చానల్‌ను పడగొట్టి మరల నిర్మించేందుకు అవసరమైన నిదులు సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందని రైతు నేత ముప్పరాజు కోటయ్య పేర్కొన్నారు. ఎస్ఇ కూడా తలుపుల నిర్మాణానికి సానుకూలంగా ఉన్నారన్నారు. ఈ సదస్సుకు సమావేశానికి అధ్యక్షుడు సత్యన్నారాయణ, సాదన కమిటి అధ్యక్షులు గుమ్మళ్ల వెంటకేశ్వర్లు, సర్పంచ్‌లు సి. హెచ్ వెంకటేశ్వర్లు, గాలి సుబ్రమణ్యం, ముప్పరాజు బ్రహ్మయ్య, రైతు కూలి సంఘం నాయకులు పి.కోటేశ్వరరావు, కె.జిమస్తాన్, ఎన్.గురవయ్య, ఏజెండ్ల సింగయ్య , ఆర్.వెంకటరావు , పోటు శ్రీను , 40 గ్రామాల నుంచి వచ్చిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణపై పార్లమెంట్‌లో బిల్లు కోసం రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి-ఉలవపాడు

ఉలవపాడు లో ఎస్‌సి వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కోరుతూ రిలే నిరాహర దీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో వర్గీకరణ చేసి పెద్దమాదిగను అవుతానని చప్పిన చంద్రబాబు తరువాత మోసం చేశాడని ఎన్నో మాటలు చెప్పి ఎన్నికల్లో గెలుపొందాడని ఇప్పటికైన అఖిలపక్షాన్ని ఏర్పాటు చేసిన బిల్లును తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైన చంద్రబాబు మాదిగల డిమాండ్‌ను పరిష్కరించకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు ముత్తు మాదిగ, ఎంఎస్‌ఎఫ్ నాయకులు రవి, సుధాకర్, చైతన్య, వెంకటేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న బాధితుడి బంధువులు

నిందితులను అరెస్టు చేయాలని ధర్నా

పెద్దదోర్నాల : కులం పేరుతో దూషించి, తమపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ నటరాజ్‌సెంటర్‌లో మంగళవారం బాధితుడు ధర్నా నిర్వహించారు. నల్లగుంట్ల గ్రామ సర్పంచి వాదం సంజీవమ్మ భర్త వీరాంజనేయులుపై అదే గ్రామానికి చెందిన మొద్దు మల్లేశ్వరరావు అనుచరులు కులం పేరుతో దూషించి దాడి చేశారు. నిందితులను అరెస్టు చేయాలని కోరుతూ సర్పంచి సంజీవమ్మ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

జొన్న రొట్టెలకు గిరాకీ

మహిళలకు జీవనాధారంగా మారిన వంటకం

ప్రజాశక్తి-గిద్దలూరు

పిండికొద్దీ రొట్టె అని సామెత ఉంది. కొందరు మహిళలు జొన్నరొట్టెలు విక్రయిస్తూ వచ్చిన ఆదాయంతో కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. గిద్దలూరులోని పలు ప్రాంతాల్లో కొందరు మహిళలు జొన్నరొట్టెలు తయారు చేసి విక్రయిస్తున్నారు. తక్కువ ధరకే నాణ్యమైన రొట్టెలు అందుబాటులో ఉండటంతో ప్రజలు జొన్న రొట్టెల వైపు మొగ్గు చూపుతున్నారు. షుగర్, బిపి ఉన్నవారు, ఆరోగ్యంగా జీవించాలనుకొనే కొందరూ రాత్రి వేళల్లో భోజనానికి బదులుగా జొన్న రొట్టెలను ఆహారం తీసుకుంటారు. దీంతో ఈ రొట్టెలకు గిరాకీగా ఉంది. జొన్నపిండిలో ఏమి కలుపకుండా, నూనె లేకుండానే రొట్టెలు తయారీ చేసి విక్రయిస్తున్నారు. నూనె, ఇతర పదార్థాల కల్తీ లేకపోవడంతో పౌష్టికాహారంగా భావించి ప్రజలు వాటిని తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. గతంలో ప్రజలు చపాతిలు, పానీపూరి, పుల్కాలు తినేవారు. వాటిని తయారీ చేసేందు నూనె వినియోగించేవారు. జొన్నరొట్టెలను నూనె లేకుండా తయారీ చేస్తున్నారు. ఒక్కొక్క మహిళా ప్రతి రోజూ 50 నుంచి 60 రొట్టెలను తయారీ చేసి విక్రయిస్తున్నారు. ఒక్కొక్క రొట్టెను అందరికీ



రాగి రొట్టెలు తయారీ చేస్తున్న మహిళ

అందుబాటుగా రూ.10 వంతున విక్రయిస్తున్నారు. రొట్టెలను తినేందుకు పప్పు, బెండ, చిక్కుళ్ళు, దొండకాయ కూరలు తయారు చేస్తున్నారు. ప్రతి రోజు సాయంత్రం 4:30 నుంచి రాత్రి 9గంటల వరకూ విక్రయిస్తున్నారు. ఈ రొట్టెలును కర్రల పొయ్యిపైనే కాల్చి ఇస్తున్నారు. ఫలితంగా రుచిగా ఉండటంతో ప్రజలు ఈ రొట్టెలను తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. 5వ వార్డులోని రజక వీధి ప్రాంతం, పోలీస్‌స్టేషన్ వెళ్ళే దారి, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఈ రొట్టెలు అందుబాటులో ఉంటున్నాయి.

గ్రామాల్లో 'జన్మభూమి - మాఊరు'



బేస్తవారిపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి - బేస్తవారిపేట

ప్రజల సమస్యల పరిష్కారం కోసమే జన్మభూమి-మాఊరు గ్రామ సభలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నేకునాంబాదు, జగ్గంబొట్ల క్రిష్టాపురం గ్రామాల్లో జన్మభూమి - మా ఊరు గ్రామసభలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడుతున్నట్లు తెలిపారు. అనంతరం నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులు, పింఛన్లు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి యామా సుహాషిని, ఎంపిపి వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్‌పిటిసి టి.ఐజయ్య, ఇన్‌ఛార్జి తహశీల్దారు కె.నాగేశ్వరరావు, ఎంఇఒ జింకా వెంకటేశ్వర్లు, ఇఒఆర్‌డి అన్నెమ్మ, హౌసింగ్, విద్యుత్ ఎఇలు ఎస్.బి.గోరంట్లయ్య, వెంకటనరసయ్య, ఎపిడి పద్మావతి, ఎఒ క్రిష్ణవేణి, ఎపిఒ బెల్లంకొండ కిషోర్ కుమార్, పట్టు పరిశ్రమ అధికారి బాలసుబ్రహ్మణ్యం, యామా శ్రీనివాసులు పాల్గొన్నారు.

తారు రోడ్డు నిర్మాణానికి 1.78కోట్లు మంజూరు

బేస్తవారిపేటలోని కందుల ఓబులరెడ్డి డిగ్రీ కళాశాల నుంచి నేకునాంబాద్ గ్రామం గుండా కోనపల్లి అడ్డరోడ్డు వరకూ తారురోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 1.78కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు.

అధికారులపై ఎంపిటిసి ఆగ్రహం

నేకునాంబాద్ గ్రామంలో మంగళవారం జన్మభూమి-మా ఊరు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రోటోకాల్ పాటించలేదని సలకలవీడు ఎంపిటిసి పూనూరు భూపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

కొమరోలు : జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా మండలంలోని బ్రాహ్మణపల్లి, అల్లీనగరం గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపకార వేతనాలు, లబ్ధిదారులు రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ



గిద్దలూరులో..

కార్యక్రమంలో ఎంపిడిఒ డి.నరసయ్య, ఇన్‌ఛార్జి తహశీల్దారు ఎల్.వెంకటేశ్వర్లు, ఎంపిపి కామూరి అమూల్య, ఎపిఎం శ్రీరాం, ఎఒ జక్కం మెర్సీ, ఆర్ఐ భారతిభాయి, సర్పంచులు రాగే కృపమ్మ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కంభం : మండల పరిధిలోని ఎల్‌కోట, ఔరంగబాద్ గ్రామాల్లో మంగళవారం జన్మభూమి-మా ఊరు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి కొత్తపల్లి జ్యోతి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సయ్యద్ జాకీర్ హుస్సేన్, తహశీల్దారు ఉషారాణి, ఎంపిడిఒ గాలెయ్య, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గిద్దలూరు : నగర పంచాయతీ పరిధిలోని ఒకటో వార్డులో జన్మభూమి-మాఊరు గ్రామ సభ నిర్వహించారు. ఈ సభకు మున్సిపల్ కమిషనర్ కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి, డిఎఫ్ఒ ఖాదర్ బాషా మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్ నాయబ్ రసూల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యం పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ స్థానిక వివేకానంద జూనియర్ కళాశాల, హైస్కూల్ విద్యార్థులు మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతలపై తమ తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకులు, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాచర్ల : మండల పరిధిలోని ఒద్దులవాగుపల్లె గ్రామంలో సర్పంచి సుబ్బలక్ష్మమ్మ , సోమిదేవిపల్లిలో సర్పంచి రామసుబ్బమ్మ అధ్యక్షతన జన్మభూమి - మా ఊరు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమ స్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సయ్యద్ మస్తాన్‌వలి, జడ్‌పిటిసి నాగరత్నమ్మ, తహశీల్దారు ఎలిజబెత్‌రాణి, హౌసింగ్ ఎఇ ఖదీర్‌బాషా, అనుమలవీడు వైద్యాధికారి డాక్టర్ రవీంద్రకుమార్, ఆర్‌డబ్ల్యుఎఇ భవాని, ఎపిఒ మహాలక్ష్మీ, ఎపిఎం, పంచాయతీరాజ్ సిబ్బంది, ఆర్ఐ హర్షకుమార్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్ధవీడు : మండల పరిధిలోని బొల్లుపల్లి, దొనకొండ పంచాయతీల్లో మంగళవారం జన్మభూమి-మా ఊరు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి నన్నెబోయిన రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. పేదలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దాంరు ప్రసాద్, ఎంపిడి ఒ సుకుమార్, సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రాచర్లలో రేషన్ కార్డులు అందజేత



అర్ధవీడులో...

చిన్న నాసరయ్యకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-త్రిపురాంతకం

అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన మాజీ ఎంపిటిసి పాడిబండ్ల చిన్ననాసరయ్య సోమవారం మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని సంత నూతలపాడు ఎమ్మెల్యే, యర్రగొండపాలెం నియోజక వైసిపి సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్ మంగళవారం సందర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ కోట్ల సుబ్బారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ చంద్రమౌళిరెడ్డి, వజ్రాల కోటిరెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అన్నా' ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-రాచర్ల

మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు మంగళవారం శ్రీసిద్ధిభైరేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొమరోలు మాజీ జడ్‌పిటిసి సారే వెంకటనాయుడు, ఆలయ ధర్మకర్త మదిరే శ్రీరంగారెడ్డి, మాజీ సర్పంచి పాలుగుళ్ళ రంగస్వామిరెడ్డి, బాదం గోపాల్, నాయకులు ఏలెం మురళీ, నాగిరెడ్డి, పుల్లారావు, అన్నా రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రీపుల్స్ యాక్షన్ ఫోరం సమావేశం

మార్కాపురం : మార్కాపురానికి జిల్లా కేంద్రంగా అన్ని అర్హతలు ఉన్నాయని, జిల్లాల సంఖ్య పెంచిన సమయంలో మార్కాపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని పీపుల్స్ యాక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సురేష్ పులుగుజ్జు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎబిఎం ఉన్నత పాఠశాల ఆవరణలో ఆ సంఘం ముఖ్య నేతలతో సమాశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కాపురం ప్రాంతాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లడంలో పాలకులు వివక్ష చూపుత ున్నారన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.




బాధితుడిని పరామర్శిస్తున్న రాంబాబు

బాధితులకు 'అన్నా' పరామర్శ

ప్రజాశక్తి-రాచర్ల

మండల పరిధిలోని గుడిమెట్ట గ్రామ మాజీ సర్పంచి షేక్ ఇస్మాయిల్ ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకొని ఇంటికి వచ్చారు. ఈ విషయం గురించి తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు మంగళవారం ఇస్మాయిల్‌ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. అదే పంచాయతీ పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన రామాలయ దేవస్థాన ఆలయ ధర్మకర్త అన్నపురెడ్డి ఈశ్వర్‌రెడ్డి గుండె ఆపరేషన్ చేయించు కున్నాడు. ఆయన్ని కూడా అన్నా వెంకటరాంబాబు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సిద్ధిభైరేశ్వర ఆలయ ధర్మకర్త మదిరే శ్రీరంగారెడ్డి, మాజీ సర్పంచులు పాలుగుళ్ళ రంగస్వామిరెడ్డి, బాదంగోపాల్, నాయకులు సిఆర్ఐ మురళీ, బెల్లం నాగిరెడ్డి, కొమరోలు మాజీ జడ్‌పిటిసి సారే వెంకటనాయుడు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



గిద్దలూరులో సినిమాలు

శ్రీవెంకటేశ్వర - ఎంసిఎ
కృష్ణ - హలో
నటరాజ్ - ఇడియట్
శ్రీనివాస - జాలియట్ లవర్ ఆఫ్

మొక్కుబడిగా జన్మభూమి -మాఊరు గ్రామసభలు

గ్రామాల్లో ఐదో విడత జన్మభూమి- మా ఊరు గ్రామసభలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. అయితే సభలు మొక్కుబడిగా సాగాయి. తర్లుపాడు మండలంలో నిర్వహించిన గ్రామసభలో గ్రామస్తులు నిరసన తెలిపారు. దీంతో గందరగోళం నెలకొంది.

ప్రజాశక్తి-మార్కాపురం

జన్మభూమి–మాఊరు కార్యక్రమం ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించే అవకాశం ఉందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. 1వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ గొలమారి ఆదిలక్ష్మి, రెండో వార్డులోని ఏకలవ్య కాలనీలోని మున్సిపల్ పాఠశాల ఆవరణలో ఆ వార్డు కౌన్సిలర్ షేక్ ముర్తుజావలి, మూడవ వార్డులోని చిన్న మసీదు వద్ద ఆ వార్డు కౌన్సిలర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ అధ్యక్షతన మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల నారాయణరెడ్డి పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ ఈ ఏడాది ఆసాంతానికి పక్కా గృహాలు నిర్మిస్తామన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ వక్కలగడ్డ రాధిక మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదలను ఆదుకునే విధంగా చర్యలు చేపట్టారన్నారు. గతంలో లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. అనంతరం నూతనంగా మంజూరైన రేషన్ కార్డులు, పింఛన్లు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, డిఇ షేక్ సుభానీ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ మోహన్‌రావు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ షేక్ షబ్బీర్‌బాష పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఇడుపూరు పంచాయతీ పరిధి దరిమడుగు గ్రామంలో జన్మభూమి–మాఊరు కార్యక్ర మంలో భాగంగా మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జడ్‌పిటిసి జవ్వాజి వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. అనంతరం నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు పి.ఉమారాణి, సర్పంచి జవ్వాజి రామాంజులరెడ్డి, ఇఒఆర్‌డి నాగేశ్వరరావు, ఎంఇఒ బి.రాందాస్‌నాయక్, ఎఒ లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ ఎఇ నాయక్, విఆర్‌ఒ హరినారాయణ, పంచాయతీరాజ్ ఎఇ మోహన్‌రావు ,కార్యదర్శులు పవన్, పెద్దిరాజు, రూరల్ విద్యుత్ ఎఇ నాగేంద్రరెడ్డి, డాక్టర్ నారాయణరెడ్డి, ఎపిఒ జీవరత్నం, వెటర్నరీ వైద్యుడు డాక్టర్ లీనాగ్రేష్, హౌసింగ్ ఎఇ విజయ్‌బాబు, ఎడిఎహెచ్ పి.రామారావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

పెద్దారవీడు : గుండంచెర్లలో ఆ గ్రామ సర్పంచి గంగుల చిన్నయల్లయ్య, కలనూతలలో సర్పంచి యామా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం జన్మభూమి–మా ఊరు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుండంచెర్ల గ్రామానికి ఓ రైతు తన పొలానికి వెళ్లేందుకు దారి చూపించాలని వినతి పత్రం అందజేశారు. కలనూతల గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు అర్జీ అందజేశారు. సంక్షేమ పథకాలను నిర్వాసిత గ్రామాలకు వర్తించడం లేదని, అలాంటప్పుడు ఈ సభలెందుకని బాధితులెఉ అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు రమణారావు, ఎంఇఒ సిహెచ్.వెంకటరెడ్డి, ప్రాథమిక వైద్యశాల వైద్యులు డాక్టర్ సునీత, ఆర్ఐ బ్రమరాంభ, సర్వేయర్ గురవయ్య, విఆర్ఒ ఎస్‌డి.కాశీంపీరా, హౌసింగ్ ఎఇ నిరీక్షన్‌బాబు, పంచాయతీరాజ్ ఎఇ సుబ్బరాయశర్మ, పశువైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్, వ్యవసాయశాఖ ఎఇఒ బుజ్జిబాయి, వైసిపి మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, ఇండ్లా రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మార్కాపురంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కందుల

యర్రగొండపాలెం : పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు తెలిపారు. మండలంలోని అమానుగుడిపాడు గ్రామంలో జన్మభూమి- మా ఊరు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి వడ్లమూడి వరలక్ష్మి అధ్యక్షతన సభ నిర్వహించారు. సభలో డేవిడ్‌రాజు మాట్లాడుతూ జన్మభూమి సంధర్భంగా అర్హులైన పేదలకు, రేషన్‌కార్డులు, పక్కా గృహాలు, కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ డాక్టర్ మన్నె రవీంద్ర, జెడ్‌పిటిసి మంత్రూ నాయక్, తహశీల్దారు రత్నకుమారి, ఎంపిడిఒ హను మంతరావు, ఎంపిటిసి వెంగళరెడ్డి,లింగయ్య, సత్యనారాయణ, టిడిపి మండల కన్వీనర్ షేక్ జిలాని పాల్గొన్నారు.

త్రిపురాంతకం : మండల పరిధిలోని కొత్త, పాత అన్నసముద్రాల్లో జన్మభూమి–మా ఊరు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి నీలం చెన్నమ్మ, స్పెషల్ ఆఫీసర్ చిన్నబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలు వివిధ సమస్యలపై 108 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.మాణిక్యరావు, పాత అన్నసముద్రం సర్పంచి అచ్చమ్మ, రఘురాములు, వైద్యాధికారి డాక్టర్ కవితాదీప్తి, పశువైద్యాధికారి డాక్టర్ సబీనా, ఎపిఒ సురేష్, ఎఒ బాలాజీనాయక్, టిడిపి నాయకులు ఓట్ల సీతా రామయ్య, డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు, ఎపిఎం ఇందిరా, పిఆర్ ఎఇ మహంకాళయ్య పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : జన్మభూమి–మా ఊరు కార్యక్రమంలో భాగంగా మండలంలోని నల్లగుంట్ల, చెర్లోపల్లి గ్రామ పంచాయతీల్లో సర్పంచి అల్లు శివమ్మ అధ్యక్షత మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎంపిపి వేదంత ప్రభాకర్ మాట్లాడుతూ, ఎంపిడిఒ బి.శ్రీనివాసులు, డిప్యూటీ తహశీల్దారు వేణుగోపాల్, ఎంఇఒ మస్తాన్‌నాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ బ్రమరాంభ, విద్యుత్ ఎఇ సురేష్‌రెడ్డి, ఎపిఒ అన్నపూర్ణ, వ్యవసాయశాఖ అధికారి వసంతరావు, పశువైద్యాధికారి డాక్టర్ నందన, డాక్టర్లు సూరే ప్రకాష్, శ్రీనివాసరావు, హౌసింగ్ ఎఇ సావిత్రిబాయి, ఇఒఆర్‌డి సుదర్శనం, వెలుగు ఎపిఎం అజయ్, విఆర్‌ఒలు శ్రీనివాసులు, అల్లూరయ్య, పంచాయతీ కార్యదర్శులు సంధ్యారాణి, కిశోర్, ఐటిడిఎ ఎపిఎం సైమన్ పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

జన్మభూమి–మా ఊరు కార్యక్రమాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మరియు వసంత జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సైమన్ విక్టర్, జన్మభూమి కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, మహబూబ్‌బాషా, భాస్కర్‌రెడ్డి, రమణమ్మ, వెంకటరాజు, సుబ్బారెడ్డి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

తర్లుపాడు లో గందరగోళం


తర్లుపాడు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసు కుంటామని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని నాగేళ్ళ ముడుపు, తాడివారిపల్లె గ్రామాల్లో జన్మభూమి–మా ఊరు గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల మాట్లాడుతూ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కందుల నారాయణరెడ్డి మాట్లాడుతున్న సమయంలో గ్రామస్తులంతా ఒక్కసారిగా మూకుమ్మడిగా అధికార పార్టీ వారు ప్రతిపక్షానికి సంబంధించిన అన్ని సంక్షేమ పథకాలను తొలగిస్తున్నారని ఆరోపించారు. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొంది .ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ ఛైర్మన్, నియోజకవర్గ జన్మభూమి కమిటీ పరిశీలకులు గుంటుపల్లి నాగేశ్వరరావు, ఎంపిపి పులివేముల ఏసుదాసు, ఎంపిడిఒ పి.శ్రీకృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ జ్యోతిసృజన, పిఆర్‌ఎఇ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఎఇ పాండురంగారెడ్డి, వెటర్నరీ వైద్యుడు డాక్టర్ కె.సురేష్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కె.రాహుల్, ఎఒ సత్యానంద్, ఉద్యానవనశాఖ అధికారి మణికుమార్, ఎంఇఒ సుజాత, దేవాదాయశాఖ కార్యనిర్వహణ అధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, డిప్యూటీ తహశీల్దారు అంజిరెడ్డి, ఎపిఒ రవికుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సిహెచ్.సుహాసిని, కార్యదర్శి రంగస్వామి పాల్గొన్నారు.



యర్రగొండపాలెంలో మాట్లాడుతున్న డేవిడ్‌రాజు



తర్లపాడులో వాగ్వాదం



మార్కాపురంలో సినిమాలు

శ్రీవిశ్వేశ్వర	.... టెన్
శ్రీజగదీశ్వరి.	.... జవాన్
శ్రీసాయిబాలాజీ.	... ఆక్సిజన్
శ్రీశ్రీనివాస	.... సప్తగిరి ఎల్ఎల్‌బి
శ్రీవిజయా	.... ఉన్నది ఒకటే జిందగీ
శ్రీరాధాకృష్ణ	.... గృహం

వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలిగా పద్మావతి

ప్రజాశక్తి-మార్కాపురం

వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలుగా తడికమళ్ల పద్మావతి, కార్యదర్శిగా చీదెళ్ల వెంకట రత్నం, కోశాధికారిగా బొంతల భారతిలు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక శ్రీరామ కృష్ణ విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వాసవీ వనితా క్లబ్ నిర్వాహకులు గోళ్ల వరలక్ష్మి, నారాయణం తులసీ మాట్లాడుతూ వనితా క్లబ్‌లో విస్తృతంగా సభ్యులను చేర్పించి, క్లబ్‌ను పట్టిష్టం చేయాలన్నారు. నూతన అధ్యక్షురాలు పద్మ మాట్లాడుతూ క్లబ్ కార్యకలాపాలను అన్ని ప్రాంతాలకు విస్తరింపజేసి, అర్హులైన వారికి సహాయ సహకారాలు అందించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి క్లబ్ ప్రతినిధి నారాయణం లావణ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షురాలు గాయత్రీ, వాసవీ క్లబ్ ప్రతినిధులు శ్రీను, రవి, కేశవ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానం అందుకుంటున్న పద్మావతి



ఇంటింటి ప్రచారంలో నాయకులు

ఇంటింటికీ ప్రచారం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని కోరుతూ మండలంలోని రాయవరం గ్రామంలో మంగళవారం ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి పోలిశెట్టి తిరుమలయ్య మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం రజకులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వర్లు, నాయకులు టివి.కాశయ్య, సురభి వెంకటేశ్వర్లు, మోతటిక నారాయణ, పొదిలి నాసరయ్య, గట్టు వెంకటేశ్వర్లు, తలమంచి కాశయ్య, పొదిలి నాగమ్మ పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన

సమాజ వికాసంపై అవగాహన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జన్మభూమి–మాఊరు కార్యక్రమంలో భాగంగా స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద విద్యార్థులు, రైతులు, గ్రామస్తులకు కుటుంబ .సమాజ వికాసంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం విఆర్‌ఒ షేక్ బడేసాహెబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ సందర్భంగా డేవిడ్‌మేరి బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు స్వచ్ఛ భారత్ కార్యక్రమంపై డిబెట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిసి హాస్టల్ వార్డెన్ కాశయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సెలవులు లేవు : ఎంఇఒ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జన్మభూమి–మాఊరు కార్యక్రమం సందర్భంగా మండలం లోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సెలవులు రద్దు చేసినట్లు ఎంఇఒ ఆంజనేయులు తెలిపారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ఈనెల 5 నుంచి జరుగబోయే జన్మభూమి విద్యా సదస్సులో విద్యార్థుల చేత వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వ్యాస రచన, డిబెట్, నాటిక పోటీలు నిర్వహించి బహుమతులు అంద జేయాలన్నారు.ఈ కార్యక్రమంలో అన్ని పాఠశాలల ప్రధానో పాధ్యాయులు పాల్గొన్నారు.

8న విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-మార్కాపురం

ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మార్కాపురం నియోజకవర్గ పరిధి, మార్కాపురం మండల పరిధిలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, ఇంటర్మీడియట్ స్థాయి విద్యార్థుల వరకు ఈనెల 8న వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీసాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ మంగళవారం తెలిపారు. జూనియర్ విభాగం లో బాధ్యత గల ఓటరుగా ఎలా తయారుకాగలడు' అనే అంశంపై, సీనియర్ విభాగంలో డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ విద్యార్థులకు 'భారత రాజ్యాంగం అందుకు యువజన పాత్ర ఏమిటి' అనే అంశాలపై వక్తృత్వం, వ్యాస రచన పోటీ పరీక్షలు ఎంఇఒ పర్యవేక్షణలో శ్రీసాధన డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వెలుగొండను పూర్తి చేసే బాధ్యత నాదే

- దొనకొండ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు చర్యలు
- ఖరారైన ట్రిపుల్ ఐటి భూములు
- గనుల విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తా
- జన్మభూమి - మాఊరు ప్రారంభ సభలో సిఎం వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్/దర్శి

'జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన వెలుగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసే బాధ్యత నాదే. 2018 ఆఖరి నాటికి మొదటి టన్నెల్ పనులు పూర్తి చేస్తాం' అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. దర్శి మోడల్ స్కూలు మైదానంలో ఐదో విడత జన్మభూమి - మాఊరు కార్యక్రమాన్ని మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సోమశిల ప్రాజెక్ట్ నుండి రాళ్ళపాడు ప్రాజెక్ట్‌కు సాగునీరు అందించటానికి చర్యలు తీసుకుంటామన్నరు. ఒంగోలులో ట్రిపుల్ ఐటి నిర్మాణానికి స్థల సేకరణ పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని అన్నారు. రూ.150 కోట్లతో నాగార్జున సాగర్ కాల్వలు ఆధునీకరణ పనులు చేపడుతున్నామన్నారు. పప్పు, చిరుధాన్యాల పరిశోధన కేంద్రాన్ని గతంలో ఇచ్చిన హామీలో భాగంగా గనుల విశ్వవిద్యాలయం జిల్లాలో ఏర్పాటు చేస్తామన్నారు. దొనకొండ పారిశ్రామిక కారిడార్‌కు 10 వేలు ఎకరాలు సేకరించారని, ప్రజలు సహకరిస్తే కారిడార్ ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు.

రాష్ట్రంలో రుణమాఫీ అమలు తీరును మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు అధ్యయనం చేశాయన్నారు. నీటిభద్రతలో భాగంగా ఒక్క పంటకు నీళ్ళు ఇస్తామని, సుస్థిర వ్యవసాయం చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. మార్కెట్ ఇంటర్వెషన్ స్కీం ద్వారా రైతుల వద్ద ఉన్న వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. గతంలో డ్వాక్రా సంఘాలను తానే పెట్టానని, వారికి వడ్డీ లేని రుణాలు అందించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.680 కోట్ల వడ్డీని మాఫీ చేశామని ముఖ్యమంత్రి తెలియజేశారు. ముస్లిములకు రంజాన్ తోఫా, క్రైస్తవులకు క్రిస్మస్ గిఫ్ట్, ప్రజలకు సంక్రాంతి కానుకను అందిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకంలో రాష్ట్రంలో 46.56 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నామని, ప్రభుత్వంపై రూ.5609 కోట్ల భారం పడుతోందని అన్నారు. మరో 4-5 లక్షల కొత్త పింఛన్లు ఇవ్వనున్నామని మరో రూ.1500 కోట్ల భారం పడుతోందన్నారు. చంద్రన్న పెళ్ళి కానుకగా ఎస్‌టిలకు రూ.50 వేలు, ఎస్‌సిలకు రూ.40 వేలు, బిసిలకు రూ.30 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది ఉగాది నుండి చంద్రన్న పెళ్ళి కానుక పంపిణీ చేస్తామన్నారు. ఆడవారికి మరుగుదొడ్డి ఆత్మగౌరవానికి సంబంధించిందని, రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 6 జిల్లాలు ఒడిఎఫ్‌గా ప్రకటించామని, మార్చి 31 నాటికి 100 శాతం ఒడిఎఫ్‌గా చేస్తామన్నారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలలో 13 లక్షల 6 వేలు, పట్టణ ప్రాంతాలలో 6 లక్షల గృహాలు మంజూరు చేశామని, గత అక్టోబర్లో లక్ష గృహాలు ప్రారంభోత్సవం చేశామన్నారు. సంక్రాంతికి ఒకేసారి 2.5 లక్షల ఇళ్ళకు గృహ ప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గుంటూరులో క్రిస్టియన్ భవన్ ఏర్పాటుకు కోట్లు కేటాయించామన్నారు. త్వరలో డిజిటల్ లాకర్ ఏర్పాటు చేస్తామని, ఇందులో ఆరోగ్య సమస్య పత్రాలు, డాక్యుమెంట్లు, విద్య, ఇతర ధృవీకరణ పత్రాలు ఉంచుకోవచ్చన్నారు.



బాలామృతం కింద పౌష్టికాహారం పంపిణీ

రెండంకెల అభివృద్ధిలో ప్రథమ స్థానం : శిద్దా

రెండంకెల అభివృద్ధిలో దేశంలో రాష్ట్ర ప్రథమ స్థానంలో ఉందని రాష్ట్ర అటవీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. రైతు రుణమాఫీ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. శరవేగంతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ఇందుకు ప్రజలు సహకరించాలని, భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. అనంతరం సంక్షేమ సందర్శిని కరపత్రాన్ని, చంద్రన్న పెళ్ళి కానుక సిడిని సిఎం ఆవిష్కరించారు. అనంతరం సిఎం చంద్రబాబు నాయుడుని మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, మంత్రి కుమారుడు, యువపారిశ్రామిక వేత్త శిద్దా సుధీర్ కుమార్ ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ, ఇన్‌చార్జి మంత్రి పి.నారాయణ, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ జూపూడి ప్రభాకరరావు, జడ్పీ ఛైర్మన్ ఈదర హరిబాబు, ఎమ్మెల్సీ కరణం బలరామకృష్ణమూర్తి, ఉన్నత విద్య కమిషనర్ బి.ఉదయలక్ష్మి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ రామాంజనేయులు, విద్యా శాఖ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, కలెక్టర్ వి.వినయ్ చంద్, సంయుక్త కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దివిశివరాం, కరణం వెంకటేష్ పాల్గొన్నారు.



సభకు హాజరైన జనం



సభా వేదికపై మంత్రి శిద్దా రాఘవరావు, ఎమ్మెల్సీ బలరాం మాటామంతీ..